Living Word Theological College

"Living Word Theological College seeks to train and develop passionate servants of Jesus Christ to accomplish the Great Commission"

- Bishop Dhanraj Kota, Chairman, LWT College.



LIVING WORD Theological College

Netajinagar, Sainikpuri, Kapra, Hyderabad

Offers
Bachelor of Theology
2 Years Residential Course

Qualifications
Born Again & Inter Pass

Contact for
Application & Prospectus

# 101, YMCA Complex,
Sarojini Devi Road,
Secunderabad - 500 003
Ph : 040 27804433
njmoffice@gmail.com

Director : Rev.Dr.Dhanraj Kota
9849272313

PARTNERING WITH YOU
IN PURSUING YOUR CALL

# జ్ఞానుల చరిత్ర



బ్రదర్ పి.ఇమ్మానుయేలు
రిటైర్డ్ ఎస్‌బిఐ మేనేజర్
విశాఖపట్నం

యేసుక్రీస్తు జన్మించిన తరువాత ఆ బాలయేసును దర్శించ డానికి గొల్లలు వచ్చారు. యేసు జన్మించినది యెరూషలేములోని బెత్లెహేములోగల పశువుల పాకయని మీకు తెలియును కదా! గొల్లలు గొఱ్ఱెపిల్లలను కానుకగా తెచ్చి ఆరాధించారు. జ్ఞానులు తూర్పు దేశము నుండి వచ్చారు. వారు బంగారము సాంబ్రాణి, బోళమును కానుకలుగా యిచ్చి ఆరాధించారు. వారికెలా తెలిసింది? నీలాకాశములో వారు ఒక తేజోనక్షత్రము చేతనడిపింపబడ్డారు. గబ్రియేలు దూత స్వరమును విని తెలుసుకొన్నారు. యేసును ఆరాధించడాన్కి వచ్చిన జ్ఞానులు ఏయే దేశస్తులో వారెట్లు వచ్చారో మనమిప్పుడు తెలిసికొందాము.

**1) ఐగుప్తీయుడైన బెల్తాసరు :**

ఐగుప్తీయులు మొదట ఒక్కదేవుని ఆరాధించేవారు కాని తరువాత చాలామంది దేవుళ్ళను ఏర్పరచుకొని విగ్రహారాధికులైనారు. యోసేపు కాలములో ఐగుప్తుకు వచ్చిన ఇశ్రాయేలీయులు వారికి బానిసలైనారు. వారు బోధలు శ్రమలు అనుభవించారు కాని, యెహోవా దేవుడు వారికి తోడుగానుండి, ఆ దాస్యము నుండి విడుదల కలుగజేసాడు. అప్పుడు ప్రజలు వారి దేవుడే నిజమైన దేవుడని నమ్మారు. అట్టివారిలో బెల్తాసరు ఒకడు. అతడు ఆకాశములోని నక్షత్రాన్ని చూచాడు. యెరూషలేములో రక్షకుడు పుట్టనైయున్నాడనే స్వరము విన్నాడు. ఆ రక్షకుడైన యేసుని చూచి ఆరాధించాలని కుతుహలంగా ఉన్నాడు.

2) భారత దేశస్తుడు – అతని పేరు మెర్కిమోర్:

బ్రాహ్మణుడు బ్రహ్మ దేవుడని నమ్మి పూజించే వాడు. ఆ కాలములోనున్న కుల, మతాలు అతనికి ఇష్టము కాలేదు. ఒకరోజున అతడు దేవదర్శనము పొంది, దేవుడు ప్రేమయైఉన్నాడని తెలుసుకున్నాడు. హిందువులు "బ్రహ్మయే ప్రేమ" అని నమ్మేవారు అందు వలన వారి మెర్కిమోర్ బోధవినక అతన్ని చంపాలని ప్రయత్నించారు. అతడు హిమాలయ పర్వతాలు చేరి, నిజమైన దేవుని తెలిసికోవడాన్కి, ఉపవాసదీక్ష పూని ప్రార్థించాడు. ఇతడు కూడా ఒక రాత్రి నీలాకాశములోని నక్షత్రాన్ని చూచాడు. బెల్తాసరు వలె ఇతడు ఒక స్వరము విన్నాడు. రక్షకుని దర్శించాలని యెరూషలేమునకు బయలుదేరాడు.

3) గ్రీసు దేశీయుడు : గ్రీసులోని ఏథేనియా వాడు

అతని పేరు గాస్పర్. గ్రీసు దేశస్తులు. బహుమంది దేవుళ్ళను పూజించేవారు. చాలా జ్ఞానవంతులు – విద్యావంతులు. ఇతడు – దేవునికి, మానవుని ఆత్మకు ఉన్న సంబంధము తెలుసికోవడాన్కి రాత్రింబగళ్ళు ఒక గుహలో ప్రార్థించాడు. ఒక యూదిని ద్వారా యెరూషలేములో యూదుల రాజుగా జన్మించనైయున్న రక్షకుని గూర్చి తెలుసికొన్నాడు. ఆయన సర్వ ప్రపంచానికి లోక రక్షకుడని తెలియజేసిన యూదుడు వెళ్ళిపోయాడు. గాస్పర్ గుహద్వారాము వద్ద కూర్చొని, నీలాకాశపు వైపు చూచాడు. ప్రకాశవంతమైన నక్షత్రము తన తలకు పైగా ఉండుట గమనించాడు గాస్పర్. "నీవు ధన్యుడవు, ఆత్మనిన్ను నడిపిస్తుంది. నీవు తప్పక రక్షకుని చూస్తావు" అనే స్వరాన్ని విన్నాడు.

బెల్తాసరు, మెల్కియార్, గాస్పర్, ఈ ముగ్గురు ఒకే లక్ష్యముతో ఉన్నారు. అరేబియా ఎడారిలో కలుసుకున్నారు. తమ దర్శనాలను వివరించుకొన్నారు. వారికి నీలాకాశములో కనబడిన ఆ నక్షత్ర మార్గము ననుసరించి, సుదీర్ఘ ప్రయాణం చేసి యెరూషలేము చేరుకున్నారు. ఆనాటి రాజు హేరోదు అంత:పురమునకేగినారు. "రాజులు" జననము వారు వచ్చిన కారణం తెలిపి, యేసు జన్మించిన స్థలమును గూర్చి అడిగారు. రాజుకు తెలియదు యూదుల రాజు అనగానే కలవరపడ్డాడు అజ్ఞానులు నక్షత్రము యొక్క సహాయంతో బెత్లెహేం చేరారు. నక్షత్రము ఒక చిన్న పశువులపాక మీదుగా వచ్చి ఆగిపోయింది. రారాజు జన్మస్థలమంటే ఒక గొప్ప అంత: పురమని రాజప్రాసాదమని ఊహించిన వారికి, ఆశ్చర్య రీతిగా పశువుల తొట్టియే పాన్పుగా ....... బాల యేసును చూచారు. యేసు చుట్టూ గొప్ప వెలుగుండటం గమనించారు. వారి జన్మతరించింది. అత్యానందభరితులైనారు. తమ పెట్టెలు విప్పి తాము తెచ్చిన కానుకలు సమర్పించారు. బంగారము – ఆయన రారాజు అని, సాంబ్రాణి – ఆయన నిరంతర ప్రధాన యాజకత్వానికి, భోళము – ఆయన మరణ పున:రుత్థానములకు గుర్తుగా అర్పించి ఆరాధించారు.

# 'కరుణా సంపన్నుడు'

(మొదటిపేజీ తరువాయి) అందుక్కాణం – మన బతుకున జరిగే సంభవాలు.. తదనంతరం జరిగే పరిణామాలు. ఎవరు ఎవరి యెడలైనా కరుణ చూపేది ఆ యా సందర్భాల్లోనే! కరుణను సుసంపన్నంగా కలిగి జీవితాంతం దాన్ని చూపగలిగినవారు బహు అరుదనే పెద్దలంటుంటారు. అలాంటి వారు ఉండుట అసాధ్యమన్న వారూ లేకపోలేదు. కాని, ఆ అసాధ్యాన్ని తన బతుకున సుసాధ్యంజేసి లోకానికి చూపిన మార్గదర్శి యేసుక్రీస్తు అని పరిశుద్ధ గ్రంథంలోగల ఆయన చరిత్ర తెలుపుతుంది. దాన్నెవరు కాదన్నాలన్నా ఆయన గురించి రాయబడిన పరిశుద్ధ గ్రంథంలోగల నాలుగు సువార్తలు చదవాలి.

యేసుని గురించి వ్రాయబడిన సువార్తలు ఆనాడు ఆ యా సంగతులను విన్నవారు, చూచిన వారిచే వ్రాయబడ్డాయి. అవి అసంబద్దాలు.. కల్పితాలైతే ఆ తర్వాతి జనాంగాలే వాటిలోగల తప్పులు పట్టేవారన్నది నిఖార్సైన నిజం. ఆనాటి నుంచి నేటి వరకు ఎన్ని తరాలు గడచినా ఆ సువార్తల్లోగల సత్యాలను కాదనజాలకున్నారు. మనుషుల జ్ఞానం పెరుగుతున్న కొలదీ అంతకు ముందున్న.. చెప్పబడిన.. రాయబడిన వాటిని సులువుగానే విమర్శించగలుగుట చూడగలుగుతున్నాం. అంతెందుకు మనం రాసిన వాటినే మరికొన్నేళ్ల తర్వాత చూస్తే అందు సరిచేయాల్సిన వెన్నో కనబడక మానవు. కనీసం కొన్నైనా అలా రాయకుండా ఇలా రాసుంటే బావున్ను.. లేక ఇంకా ఇలా రాసుంటే బావున్నని అనిపిస్తుంది. ఈ అనుభవం దర్శకుల్లోను, రచయితల్లోను.. అలాంటి వృత్తి కలిగిన వారిలోను పుష్కలంగానే ఉంటుంది. అందుక్కారణం – దినదినానికి మన జ్ఞానం వికసించుటే అంటారు విజ్ఞులు. మరి అలాంటప్పుడు యేసు జీవించిన కాలంలో ఉన్నవారు, ఆయన తదనంతర తరంలో పుట్టిన వారు రాసిన వాటిలో మార్పులు చేర్పులు జరగాలి. కాని, జరగలేదంటారు పరిశుద్ధ గ్రంథ పండితులు. అలాగే వాటిలో తప్పులు ఎంచాలి. నాటి నుంచి నేటి వరకు వాటిలో నిరూపణకు నిలబడే తప్పులు చూపే వారు లేరన్నదానికి చరిత్రే సాక్ష్యం. పోనీ మన తరంలోవారైనా వాటియందు దృష్టి సారించి తెలపవచ్చు. ఇంతటి సాక్ష్యం కలిగిన ఆ నాలుగు సువార్తలు యేసుని గురించి తెలియజేసింది ఆయన 'కరుణా సంపన్నుడు' అని!

దేవుడు మనకు అగుపడని వారు. అగుపడని వానిని ఎన్ని గుణలక్షణాలతోనైనా పొగడవచ్చు. దేవుడు అలాంటి వారైతే ఆయన సృష్టి లేక పిల్లలమని చెప్పబడే మనమెందుకు ఇలా తగలడ్డాం అన్నదీ ఈ లోకాన వినిపించే ప్రశ్నే! దానికి దేవుడిచ్చిన జవాబే యేసు జీవితం. ఆయన ఉనికిని నాడున్న జనాంగం ఎరిగినప్పట్నుంచి కడవరకు ఆయన బతుకున కరుణ సుసంపన్నం. అది నాటి జనాంగానికి చూచే భాగ్యం కలిగింది. మనకిప్పుడు చదివే భాగ్యం కలిగింది. ఇతరులకు తెలిపే భాగ్యం క్రైస్తవులందరికీ దక్కింది. అందుకు దేవునికి స్తోత్రము.

యేసుని గురించి వ్రాయబడినట్లు ఈ లోకాన మరెవరి గురించీ వ్రాయబడినట్లు దాఖలాలు లేవు. అందుకు చరిత్రలో ఆధారాలూ లేవంటారు పరిశోధకులైన పరిశుద్ధ గ్రంథ పండితులు. పుట్టుక ముందునుంచీ.. మరణం తర్వాత జరిగే సంభవాలను గురించీ ఓ వ్యక్తి గురించి వ్రాయబడింది చరిత్రలో ఉందంటే అది కేవలం యేసుక్రీస్తు గురించేనన్నది 'సత్య'దూరంగాదు. అట్టి కరుణా సంపన్నుడు, దేవునికి ప్రతి రూపంగా ఇలలో జీవించిన యేసుక్రీస్తుని ప్రకటించు మా బతుకులెంత ధన్యములోగదా అన్పిస్తుంది క్రైస్తవులైన వారికి! అలా అన్పించని వారు.. ఆయన చూపిన మాదిరిని అనుసరించుటకు ప్రయత్నించని వారు క్రైస్తవులు కారు.. కాలేరు!! కరుణా సంపన్నుడు అని అగోచరుడైన దేవుని గురించి చెప్పిన పరిశుద్ధ గ్రంథం గోచరుడైన యేసుని క్రీస్తుని లోకానికి కరుణా సంపన్నునిగా చూపింది. ఆ యా విషయాలను చదివి గ్రహిస్తే చాలు.. ఆ సంగతి బయల్పడుతుంది. అందుకు రుజువుగా ఆ నాడు వ్రాయబడిన దేవుని మాట ఇలా సాక్ష్యమిస్తుంది.. దేవుడు (సర్వలోకులకు తండ్రి) క్రీస్తు ననుసరించు వారిని ఏ విధంగా కృపచేత రక్షించారోనన్నది ఈ క్రింది వాక్యం తెలుపుతుంది.


**మీ అపరాధములచేతను పాపముల చేతను మీరు చచ్చినవారై యుండగా, ఆయన (దేవుడు) మిమ్మును క్రీస్తుతో కూడ బ్రతికించెను. .... యీ ప్రపంచ ధర్మము చొప్పున మునుపు నడుచుకొంటిరి. వారితో కలిసి మనందరమును శరీరముయొక్కయు మనస్సు యొక్కయు ఇచ్ఛలను నెరవేర్చుకొనుచు, మన శరీరాశలను అనుసరించి మునుపు ప్రవర్తించుచు, కడమ వారివలెనే స్వభావసిద్ధముగా దైవోగ్రతకు పాత్రులమైయుంటిమి. అయినను దేవుడు కరుణా సంపనున్నడైయుండి, మనము మన అపరాధములచేత చచ్చినవారమై యుండినప్పుడు సహా, క్రీస్తుతో కూడ బ్రతికించెను (ఎఫెసీ 2:1-5).**

దేవుడు సర్వలోకులకు తండ్రియని పరిశుద్ధ గ్రంథం ద్వారా యేసు మరోసారి ప్రపంచానికి చాటారు. ఆ దేవునికి నీవు నేను అను బేధం లేదు. మనం కూడా యేసులాగే ఆయన బిడ్డలం. ఆయనలానే జీవించాల్సిన వారం. కాని, మనం చేసిన అపరాధములే మనల్ని అలా జీవించనివ్వట్లేదని గమనించుకోవాలి. అందువల్ల దేవునిలా జీవించుట మనకు తగును అన్నది నిరూపించుటకే యేసు భువిపై మనవలే నడయాడారు. మాదిరికర జీవితాన్ని సాక్ష్యముంచిపోయారు. ఆత్మరూపుడై సదాకాలము తన వారికి.. నమ్మినవారికి.. ఇకపై నమ్మబోవువారికి తోడుంటానని వాగ్దానం చేసారు. ఆ వాగ్దానాన్ని నెరవేరుస్తుంటూనే ఉన్నారు. అందుకు సాక్ష్యంగానే నేడీలోకాన కరడుగట్టిన హంతకులు తీవ్రవాదులు, ఫాక్షనిస్టులు, దొంగలు.. అలా మరెందరో తమ బతుకున మార్పు చూపుతున్నారు. ఇతరులకు తమలోగల కరుణనూ కనబర్చుతున్నారు. అట్టి వారందరూ మాదిరిగా తీసుకున్నది యేసు జీవితాన్నే. అదే వారికో కొత్త జీవితాన్నిచ్చింది.. ఇస్తుంది. ఇస్తూనే ఉంటుంది. లోకాన తన్ను నమ్మిన వారందరి బతుకుల్లో అట్టి మార్పు చూపేందుకు కారణభూతుడైన యేసును లోకానికి పంపిన తండ్రియైన దేవుడు కరుణా సంపన్నుడు. అగోచరుడైన ఆ దేవున్ని తన శరీరంతో.. లోకానికి గోచరింపజేసిన యేసు మాత్రమే కరుణకు సింబల్‌గా లోకస్తులకు కనబడుట ఆలోచించాల్సిన అంశం. కరుణ అనగానే లోకాన ఠకుక్కన గుర్తొచ్చే పేరు యేసుక్రీస్తు. అది క్రైస్తవులకు భయం కలిగి జీవించేట్లు చేయాలి. మన వలన ఆయన దూషింపబడకుండేట్లు జీవించడమే క్రైస్తవజీవితం. అట్టి భయభక్తులతో జీవించే ప్రతివారు తమ బ్రతుకునా కరుణను నిలువెల్లా కనబర్చగలరు. అందరూ అలానే ఉండాలన్నది తండ్రియైన దేవుని ఆశ. ఆ ఆశను తీర్చేందుకు మనవంతు ప్రయత్నం మనం నిరంతరం చేస్తూనే ఉండాలి. అందుకు తగు విధమైన సహాయం చేస్తూ మనల్ని నిరంతరం కాచి కాపాడుట దేవునికి తగును. అట్టి దేవునికి స్తోత్రము.

క్రైస్తవనాడు పేపర్లో పతాక శీర్షికలుగా తొలినాళ్లనుంచి తండ్రియైన దేవుని, ప్రభువైన యేసుని అనేక పేర్లతో మహిమ పరుస్తున్నప్పుడు ఇతరుల గ్రంథాల, విశ్వాసాల జోలికి వెళ్లడంలేదు. తద్వారా అనవసర వివాదాలకు దూరంగా ఉంటున్నాం. ఇది సువార్త ప్రకటనలో 'క్రైస్తవనాడు' తొలినాళ్లనుంచీ చూపుతున్న మాదిరి. ఆ విధంగా అనేకులకు సువార్త ప్రకటిస్తున్నాం. ఇది క్రైస్తవనాడు ఒరవడి. మరిన్ని రాసేట్లు మీ కుటుంబ ప్రార్ధనల్లో గుర్తు చేసుకోగలరని కోరుతున్నాం -ఎడిటర్.

# క్రైస్తవనాడు

ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక





బ్రదర్ వై కనకరాజు (హోలీ బైబ్లిసిస్ట్)

# అతిశయం

ప్రతి వ్యక్తిలోనూ ఏదో ఓ విషయంలో అతిశయం కన్పడుట సహజం. మనుష్యులు అతిశయించుట మంచిదే! కానీ తాము కన్పరచే అతిశయం ఎదుటి వారిని దూరం చేయకూడదు. అట్టి అతిశయం మనిషిని పతనానికి చేరుస్తుంది. తమ నెవరికీ దూరం చేయని అతిశయమే ఉత్తమాతిశయమని గ్రహించు వారే విజ్ఞులు. ఇట్టి అతిశయముంటుందా? అసలు అతిశయమంటేనే ఎదుటి వారిని ఏకొంతైనా నొప్పించేది కదా అన్న అనుమానం మీకు రావచ్చు. నిజమే! లోకంలో గల విషయాలను బట్టి ఎవరు అతి శయించినా ఎదుటివారికి నొప్పి కలగొచ్చు. తద్వారా ఒకరి యందొకరు ద్వేషాభావాలను పెంచుకొనేందుకు ఆస్కారముంది. లోకానికి భిన్నంగా ఉండేదే పరలోకం. పరలోకానికి మార్గాన్ని తెలిపే పరిశుద్ధ గ్రంథం 'అతిశయించువాడు ప్రభువునందే అతిశయిం పవలెనని' అంటుందని గమనించాలి. ప్రభువునందు అనగా వాక్య మందు అతిశయించువారు దేవునికిష్టులు. అది దేవుని చిత్తం. మనలో ఎవరైనా వాక్యంలో అతిశయించుట కన్పడితే దేవుని వాక్యసారాంశాన్ని బట్టి వారిని గౌరవించాలి. వారిలా అతి శయించేందు ప్రయత్నించాలే గాని వారిని చూసి ఈర్ష్యాసూయలు చెందరాదన్నది గమనార్హం. వాక్యంలో అతిశయించు వారిని చూసి సజ్జనులైతే సంతోషిస్తారు. దుర్జనులైతేనే ఈర్ష్యా సూయలకు లోనై అంతకంతకు చెడిపోవుదురని పరిశుద్ధ గ్రంథ పండితులు, పెద్దలు చెప్పిన మాటలెంతైనా నమ్మదగినవే సుమా! లోకాతిశయం అందరిని దూరం చేస్తుంది. దైవాతిశయం సజ్జ నులను పురిగొల్పుతుందన్నది మన మస్తిష్కాల్లో నిక్షిప్తమవాలి. అపుడే దేవునిలో అనగా వాక్యంలో ఎదుగగలం, అతిశయిం పగలం. తద్వారా అతిశయించువాడు ప్రభునందే అతిశయిం పవలెనన్న వాక్యాన్ని మనలోనూ నెరవేర్చుకోగలం! ఏమంటారు?

(ఇది మునుపటిదే. పాఠకుల కోరికపై మరోసారి ఇవ్వడమైనది!)

"ప్రభువు వాక్యము శీఘ్రముగా వ్యాపించి మహిమ పరచబడు నిమిత్తము..... మా కొరకు ప్రార్థించుడి"

**గమనిక** అనేకమంది చందాదారులు, ప్రకటన కర్తల సూచనపై 'క్రైస్తవనాడు' స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అకౌంట్ నెంబరు ఇస్తున్నాం. ఇది 'క్రైస్తవనాడు' సబ్ - ఎడిటర్ మరియు డిజైనర్ బ్రదర్ వై.ధనరాజు కు సంబంధించినది. చందాదారులు, ప్రకటనకర్తలు తమ సౌకర్యాన్ని బట్టి ఈ క్రింది అకౌంట్‌లలో సొమ్ము జమచేయొచ్చని తెలియజేస్తున్నాం. - ఎడిటర్

**CHRISTAVANAADU**
**Andhra Bank**
***Current A/C* : 13 96 111 00 00 00 52**
IFS Code : ANDB0001396
Adarsha Nagar Branch, Visakhapatnam

**Y.DHANA RAJU**
**State Bank of India**
**S/B A/c No.: 34513409917**
IFS Code : SBIN0010602
Vishalakshi Nagar, Visakhapatnam

సం॥ చందా ₹ 200. చందాదారులకు పెళ్లి, పుట్టినరోజు, స్మారక ప్రకటనలు **ఉచితం!**

చందాదారులకు మాత్రమే రెగ్యులర్‌గా పంపబడుతుంది. పత్రిక అందని చందాదారులు ఉత్తరాల ద్వారా మాత్రమే ఆ సంగతి మాకు తెలియజేయాలి. లేకుంటే మేం బాధ్యత వహించలేం. చందాలు, ప్రకటనలకు సంబంధించిన సొమ్ముకు తగు రసీదు వెంటనే తీసుకొని 9346960601 / 9866113513 నంబర్లకు ఫోన్ చేయండి.

మీ రచనలు, వ్యాసాలు, ప్రసంగాలు, కవితలు, పద్యాలు, ఏవైనా సరే మేము ప్రచురించాలంటే భారతదేశ సార్వభౌమ త్వానికి, భారత రాజ్యాంగానికి భిన్నంగా ఉండరాదు. లోకోక్తులు, టిప్స్, జనరల్ స్టడీ బిట్స్ సేకరణలు, అలాగే మునుపటి సంచికల్లో గల కొన్ని శీర్షికలు అనేక మంది పాఠకుల కోరికపై మరలా వీలును బట్టి ఇస్తున్నాం. అందువల్ల కొన్ని రిపీట్ అవుతున్నాయి. ముందు జరిగినదే ఇప్పుడును జరుగును; జరుగవోవునది పూర్వమందు జరిగినదే; జరిగిపోయినదానిని దేవుడు మరలా రప్పించును. ★

'క్రైస్తవనాడు'లో ప్రచురించబడే ఇతరుల రచనలు ఆయా రచయిత / రచయిత్రిల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే, పత్రిక పాలసీకి ఎటువంటి సంబంధం లేదు. అడ్వర్టైజ్ మెంట్స్‌పై స్పందించే ముందు క్షుణ్ణంగా విచారించుకోండి. ఈ పత్రికకు ఏ విధమైన సంబంధంలేదు.

ఎడిటర్ కుటుంబీకులు వ్రాస్తున్న వివరణలన్నీ అప్పటికి తగినంతమాత్రమే. సంచలనాత్మక విషయాలు, త్వరలో అని ప్రకటించినవి వీలును బట్టి ప్రచురిస్తాం. కాబట్టి రాబోవు సంచికలను మిస్ కాకండి.

'వివేకియైనవాడు తన విద్యను దాచి పెట్టును' అన్న పరిశుద్ధ గ్రంథ వాక్యాన్ని బట్టి 'క్రైస్తవనాడు' స్వరచనల్లోగల వాక్యాలకు ★ గుర్తు ఇవ్వడమైంది.

'క్రైస్తవనాడు' విస్తరించేందుకు చందాలు పంపి సహకరించండి. మీ అనుదిన కుటుంబ ప్రార్థనల్లో గుర్తుచేసుకొండి. మీ స్నేహితులకు పరిచయం చేసి ప్రోత్సహించండి. మీ పరిచర్యా వివరాలు తెలిపి ప్రచురింపజేసుకోండని కోరుతున్నాం.

'క్రైస్తవనాడు' - ఆధ్యాత్మిక, రాజకీయ, సామాజికంగా సంచలనాత్మక వివరణలు, వార్తలు, విశ్లేషణలతో లక్షలాది క్రైస్తవులకు మరియు ఇతరులకు పరిచయమైన పేరు!


రాబోవు దినములలో చిరకాలము వరకు నిత్యము సాక్ష్యార్థముగానుండునట్లు నీవు వెళ్లి వారి యెదుట పలకమీద దీని వ్రాసి గ్రంథములో లిఖింపుము. ★
వచ్చుతరము తెలిసికొనునట్లుగా ఇది వ్రాయబడవలెను సృజింపబడబోవు జనము యెహోవాను స్తుతించును. ★
ఈ మాటలు నమ్మకమును నిజమునైయున్నది గనుక వ్రాయుమని ఆయన నాతో చెప్పుచున్నాడు. ★

'యథార్థ' రాతల్లో దమ్మున్న పేపరని పాఠకులిస్తున్న సాక్ష్యాన్ని బట్టి 'దేవునికి స్తోత్రం'.

# దేవుని జ్ఞానం - మానవ విజ్ఞానం

హోలీ బైబిల్ / దేవుని మాట × సైన్స్ / శాస్త్రజ్ఞుల మాట

బ్రదర్ వై.లీలా రవిరాజు



## అతి విలువైనది!?

**నిన్ను సృష్టించి గర్భములో నిన్ను నిర్మించి నీకు సహాయము చేయువాడైన యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు. ★**

చాలా మంది ఈ ప్రశ్నకు తికమకపడకుండా వారి ఆలోచనకు సరిపోయే విధంగా రకరకాల పరికరాల పేర్లను చెప్తుంటారు. అవి లోకంలోనే అతి విలువైనవని చాలా వ్యయాలతో నిర్మించబడినవి చెబుతుంటారు కూడా. వాటి కోసం అనేకులు కష్టించి పనిచేసారని ఉపన్యాసాలు కూడా ఇచ్చేస్తుంటారు. ఆ ఉపన్యాసాలకు అనేకమంది ముగ్ధులైపోతుంటారు. కాని అవి మనుష్యులు చేసినవేనని గ్రహించకపోగా, అవే లోకంలో గొప్పవని భ్రమపడుతుంటారు. ఇది కడుశోచనీయం. ఈ భూమ్మీద అనేక కట్టడాలు ఉన్నాయి. అవి కూడా మనుష్యులు నిర్మిచినవే. వాటిని ఆధారంగా చేసుకొని అధికవ్యయాలతో మరనేకమైనవి నిర్మిస్తున్నారుకూడా. ఉదాహరణకు మనం తరచుగా చూస్తున్న టెలివిజన్. ఇది పూర్వం ఎంతో గొప్ప పరికరమే. దాన్ని చూచి ఆశ్చర్యపోయేవారు. దాని ద్వారా ఎల్‌సిడిలు, ప్లాస్మాలు, ఎల్‌ఇడిలు ఇలా రకరకాలు తయారవుతున్నాయి. ఇంకా తయారవుతూనే ఉన్నాయి. వీటికి ఆధారం ఆ పాత టెలివిజనే. మనిషి చేసిన పరికరాలు కాబట్టే వాటిని మరలా వృద్ధిచేస్తూ రకరకాల మోడల్స్‌ను తయారు చేస్తున్నారు. ప్రపంచంలో విలువైన పరికరాలు ఉన్నా, వాటిని తలదన్నే పరికరాలు వస్తూనే ఉన్నాయి.

ఈ వివరణ బట్టి లోకంలో విలువైన పరికరం ఏంటో ఆలోచించి చెప్పండి? ఏంటీ ఇంకా ఆలోచిస్తున్నారా...? మరీ అంత ఆలోచనక్కర్లేదు... మన దేహమేనండి! కాదనగలరా? కాదనలేరు సుమా! ఎందుకంటే మానవ దేహం దేవుడు చేసినది గాబట్టి. మనిషి చేస్తున్న పరికరం మార్పు చెందుతుంది. మరలా దాన్ని అధిగమించే పరికరం కనుగొనబడుతుంది. కాని దేవుడు చేసిన ఈ మానవ దేహం మారనిది.. మార్పు లేనిది. దాన్ని అధిగమించే మరో దేహాన్ని ఎవరైనా నిర్మించగలరా? నిర్మించలేరు! సరిగదా.. వెలకట్టలేరు కూడా. ఎందుకంటే దాని నిర్మాణకుడు దేవుడు కాబట్టి. మన దేహం దేవుని టెక్నాలజీ. దేవుడు చేసినవేవీ మనుష్యులు చేయలేరు. ఇది అక్షరసత్యం. ఈ సృష్టిలో దేవుడు చేసిన వాటిని మనుష్యులు చేయలేరన్నది ఎరగాలి. సృష్టిలో ఉన్న ప్రతి ప్రాణి, సూర్యచంద్రగ్రహనక్షత్రాలు దేవుడే చేసారు. దేవుడు చేసిన ఈ సృష్టిని ఉపయోగించుకుని మనుష్యులు పరికరాలను కనుగొంటున్నారే గాని వారి సొంతంగా ఏదీ తయారుచేయడం లేదు. ఇందునుబట్టి ఉన్నవాటినుండే మనిషి పరికరాలను తయారు చేస్తున్నాడేగాని తన సొంతంగా సృష్టించలేకున్నాడు. ఎందుకంటే మనిషికి ఉన్నవాటిని ఉపయోగించుకొని తయారు చేయడమే తెలుసు. సొంతంగా సృష్టించే శక్తి లేదు. ఇప్పుడు చెప్పండి ఈ లోకంలో ఉన్నవాటిలో విలువైనది మరియు ఎవరూ చేయలేనిది ఏంటో? మానవ దేహమే కదా! సూర్య,చంద్ర,నక్షత్ర,గ్రహ సముదాయాలు, పశుపక్ష్యాదులన్నీ మనకోసం చేయబడినవి.

అర్థమైంది కదా దేవుని సృష్టి ఎంత గొప్పదో. అలాంటి దేవుని ఎలా చూస్తున్నాం. ఆయనకు ఎంత విలువిస్తున్నాం. ఒకసారి ఆలోచించండి. మన మాటల్లోనే గాక ఆలోచనల్లో కూడా దేవునికి ఎంత వరకు అనుకూలంగా ఉంటున్నాయి? సరిచూచుకోవాలి.. లేకుంటే సరిచేసుకోవాలి. భూమ్మీద ఉన్న వారిలో దేవుని నమ్మిన వారే అధికం. అయితే వారు నమ్ముతున్నది నిజ దేవున్నా? లేక ఎవరికి వారే సృష్టించుకున్నవారినా? నిజదేవున్ని తెలియజేసే బాధ్యత క్రైస్తవులమైన మనకు మాత్రమే ఉందన్న పరిశుద్ధ గ్రంథం మాటను గ్రహించాలి. గ్రహించి దాన్ని ఇతరులకు తెలియజేయాలి. అది మర్చిపోయి క్రైస్తవుల్లో ఎందరో జీవిస్తున్నారు. అలా చేయుట దేవునికి అనుకూలం కాదుసుమా! ఆలోచించి గ్రహించండి. ఆచరించండి.

క్రైస్తవనాడు డిటిపి, పేజ్‌మేకింగ్ & డిజైనింగ్ : జె.సి. డిజైన్స్ , మెదక్ & విశాఖ. ఫోన్ : 9866113513

**ఎందుకు?! :** 'క్రైస్తవనాడు'లో హైందవ పండితులు, ఇతరులు, సినిమావాళ్లుచెప్పేవి మరియు రాజకీయాలను గురించి ప్రచురించుటెందుకన్నది 'మనలో' అనేకుల సందేహం! హోలీ బైబిలు దేవుని గ్రంథమంటూ బోధిస్తూ ఇతరులను, సినిమావాళ్లను చులకనజేసి మాట్లాడే ప్రబుద్ధులెందరో 'మనలో' ఉన్నారు. క్రైస్తవేతరుల మాటలు, చేతలే అంతలా ఆలోచింపజేస్తుంటే.. జీవంగల దేవుని మాటలు మరెంతలా ఆలోచింపజేయాలి! 'మనలో' ఎందరి మాటలు, చేతలు లోకాన్ని ఆలోచింపజేసి ప్రభావితం చేయగలుగుతున్నాయోనన్నది తెలిపేందుకే 'క్రైస్తవనాడు'లో అవి ప్రచురిస్తున్నాం. ఇక రాజకీయాలను గురించి... ఆ యా కాలాల్లో జరిగిన సమకాలీన రాజకీయాలు. సంగతులను అనేకం హోలీ బైబిల్లో దేవుడు వ్రాయించారు. 'నర'లోక సంగతులనే అవగాహన చేసుకోలేనివారు 'పర'లోక సంగతులను ఎలా గ్రహించగలరు? అందుకే 'నర'లోక రాజకీయ సంగతులు 'క్రైస్తవనాడు'లో చోటుచేసుకుంటున్నాయి. తొలి నుంచీ 'క్రైస్తవనాడు'ది అదే ఒరవడి. అందుకు హోలీ బైబిలే మాకు మాదిరి. అందుకే 'క్రైస్తవనాడు'కు అంత ఘనత! అందుకు 'దేవునికి స్తోత్రము'.

**ANDHRA PRADESH :** CHRISTAVANAADU,
13 - 237. Ambedkar Nagar, Old Police Station Center,
Nr. TIC Point, Arilova, Visakhapatnam - 530 040.
Andhra Pradesh State, INDIA.
Call : 9346960601, 9866113513

**TELANGANA :** CHRISTAVANAADU
C/o A.Prem Kumar, 1-5-89/6,
CSI Mission Compound,
Sadasivpet, Medak Dist - 502 291
Telangana State, INDIA. Call : 9346960601

క్రైస్తవనాడు
ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక

1-15 డిసెంబర్ 2017

# క్రిస్మస్ బహుమానము

క్రిస్మస్ సమయము అనేకులకు సంతోషము, చాలా సందడి. క్రిస్మస్ రాగానే సందడే సందడి. డిసెంబర్ ఆరంభమే ఎంతో సంతోషకరము. లోకమంతా జరుపుకొనే పండుగ క్రిస్మస్. యేసుక్రీస్తు జననమును ఎంతో వైభవముగా జరుపుకొంటాము. ఒక రాష్ట్రానికి, తెగకు, స్థలానికి పరిమితంకాని పండుగ క్రిస్మస్. జాతి, మత, కుల, వర్గ బేధము లేకుండా క్రిస్మస్‌ను లోకమంతా జరుపుకుంటారు. కొందరు క్రిస్మస్ అతి వైభవంగా చేస్తూ ప్రాణాలను కూడా కోల్పోతారు. అతి వేగంగా వాహనాలు నడిపించి మరణమైపోతారు. లేదా అతిగా తిని ఆయాసపడుతుంటారు. కాని, క్రిస్మస్ అంటే అది కాదని దేవుని ఆత్మద్వారా నేను ఈ వర్తమానంలో తెలియజేస్తాను.

'చెప్పశక్యము కాని ఆయన వరమును గూర్చి దేవునికి స్తోత్రము' - 2 కొరింథీ. 9:15 అని పౌలు భక్తుడు అంటున్నాడు. చెప్ప శక్యము కాని గొప్ప వరము ఏమిటంటే యేసుప్రభువును మనకు అనుగ్రహించాడు. ప్రత్యేకమైనది, అమూల్యమైనది,చెప్పశక్యముకాని వర్ణణాతీతమైన బహుమానము క్రీస్తే. యేసుప్రభువు పరలోక భాగ్యమును విడచిపెట్టి ఈ లోకానికి వచ్చి మన పాపముల నిమిత్తము క్రయధనముగా తన ప్రాణమును ధారపోసి మనకు రక్షణ అనుగ్రహించాడు. మన పాపములు క్షమింపబడినవి. మనము నిత్యజీవమును పొందుకుంటున్నాము. అదే మనకు గొప్ప బహుమానము.

పౌలు భక్తుడు ఎందుకు ఈ మాట అన్నాడని ఆలోచిస్తే, పౌలు ఒకప్పుడు సౌలుగా ఉన్నప్పుడు హింసకుడు, దూషకుడుగా ఉన్నాడు. 'పూర్వము దూషకుడును హింసకుడును హానికరుడనైన నన్ను, తన పరిచర్యకు నియమించి నమ్మకమైన వానిగా ఎంచినందుకు, నన్ను బలపరచిన మన ప్రభువైన క్రీస్తు యేసుకు కృతజ్ఞుడనై యున్నాను. తెలియక అవిశ్వాసము వలన చేసితిని గనుక కనికరింపబడితిని. మరియు మన ప్రభువుయొక్క కృపయు, క్రీస్తు యేసునందున్న విశ్వాసమును ప్రేమయు, అత్యధికముగా విస్తరించెను. పాపులను రక్షించుటకు క్రీస్తుయేసే లోకమునకు వచ్చెనను వాక్యము నమ్మతగినదియు పూర్ణాంగీకారమునకు యోగ్యమైనదియునైయున్నది. అట్టివారిలో నేను ప్రధానుడను. అయినను నిత్యజీవము నిమిత్తము తనను విశ్వసించబోవువారికి నేను మాదిరిగా ఉండులాగున యేసుక్రీస్తు తన పూర్ణమైన దీర్ఘశాంతమును ఆ ప్రధాన పాపినైన నాయందు కనుపరచునట్లు నేను కనికరింపబడితిని. సకల యుగములలో రాజైయుండి, అక్షయుడును అదృశ్యుడునగు అద్వితీయ దేవునికి ఘనతయు మహిమయు యుగయుగములు కలుగును గాక. ఆమెన్.' - 1 తిమోతి 1:12-17

చెప్పశక్యముగాని గొప్పవరము నిమిత్తము పౌలు భక్తుడు దేవునికి స్తోత్రము చెల్లిస్తున్నాడు. ఎందుకంటే అతని జీవితాన్ని మార్చింది ఈ వరం. ఆ వరం క్రీస్తే. పూర్వము అతను హింసకుడు, దూషకుడు, సంఘాన్ని పాడుచేసిన వ్యక్తి. యేసుప్రభువు తన జీవితంలో జోక్యము చేసుకున్నాడు. అతని జీవితము మారిపోయింది. పౌలు భక్తకోటికి అపొస్తలుడుగా మారాడు ప్రభువు యొక్క ఆ వివరింప శక్యముకాని ఆ మహాప్రేమ, జాలి, కనికరము, క్షమాపణ, మనయెడల అత్యధికముగా విస్తరించిందంటున్నాడు. క్రిస్మస్‌ను జరుపుకొన్నప్పుడు యేసుప్రభువు లోకానికి ఎందుకు వచ్చాడనే సత్యాన్ని ఎప్పుడూ మరువకూడదు. క్రిస్మస్ అంటే పిండివంటలు, క్రొత్తబట్టలు, రంగురంగులుగా అలంకరించుకొని సంతోషించడం, ఆనందించడం మాత్రము కాదు. Christ is the reason for this season ఈ పండుగకు కారణము యేసుప్రభువు. ఆయనే వివరింపజాలని దేవుడు అనుగ్రహించిన గొప్పవరము. నేను పాపుల్లో ప్రధానుడను, పాపులను రక్షించుటకు క్రీస్తుయేసు లోకానికి వచ్చాడు. నిత్యజీవము నిమిత్తము యేసుక్రీస్తు తన పూర్ణమైన దీర్ఘశాంతము ఆ ప్రధాన పాపినైన నాయందు కనుపరచునట్లు నేను కనికరింపబడితిని అని పౌలు అంటున్నాడు. దేవునికి స్తోత్రము.

మనము ఆత్మలో ఎంతో ఆనందిస్తున్నాము. ఆయనను ఆరాధించి శక్తి పొందుతున్నాము. యేసుప్రభువు ఆరాధనకు యోగ్యుడు, స్తోత్రార్హుడు, పూజార్హుడు. ఆయన సిలువమీద చేసిన గొప్ప త్యాగము మనము ఆయనలో ఆనందించుటకు కారణమైంది. మనము కనికరింపబడినవారము. మన పాత జీవితమును గమనిస్తే మనకే వెక్కసమౌతుంది. 'కాగా ఎవడైనను క్రీస్తునందున్నయెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను; ఇదిగో క్రొత్తవాయెను' - 2కొరింథి.5:17.

పౌలుగా మారిన సౌలుయొక్క పాత జీవితము గమనిస్తే సౌలు ఇంటింట జొచ్చి క్రైస్తవులను హింసిస్తున్నాడు, పీడిస్తున్నాడు. ఒక హత్యాకారుడు సంఘాన్ని నాశనం చేసిన వ్యక్తి యేసుక్రీస్తును అంగీకరించిన తర్వాత ఆయన జీవితము సంపూర్ణముగా మారిపోయింది. 'ఆ కాలమందు యెరూషలేములోని సంఘమునకు గొప్ప హింస కలిగినందున, అపొస్తలులు తప్ప అందరు యూదయ సమరయ దేశములయందు చెదరిపోయిరి. భక్తిగల మనుష్యులు స్తెఫెనును సమాధిచేసి అతనిని గూర్చి బహుగా ప్రలాపించిరి. సౌలయితే ఇంటింట జొచ్చి, పురుషులను స్త్రీలను ఈడ్చుకొనిపోయి, చెరసాలలో వేయించి సంఘమును పాడుచేయుచుండెను.' - అపొ.కా. 8:1-3. సంఘమును పాడుచేసే ఒక వ్యక్తి చెప్పశక్యముగాని గొప్పవరము (యేసుక్రీస్తు) తన జీవితములలోకి రాగానే పౌలుగా మారి దర్శనము చూసాడు. మానసికమైన ఆత్మీయమైన స్వస్థత పొందాడు. ఇంటింట జొచ్చి మనుష్యులను హింసించినవాడు, సంఘాన్ని పాడుచేసిన వాడు సంఘము నిమిత్తము కన్నీళ్లు విడుస్తూ పూర్ణమైన వినయభావంతో ప్రభువును సేవించాడు. ఇంటింటికి వెళ్లి సువార్త ప్రకటించాడు. (అపొ.కా.20:20) ప్రయోజనకరమైన వ్యక్తిగా మారిపోయాడు. అదే యేసుప్రభువులోని మహిమ.

నేను మారడానికి కారణం కూడా అదే. నేను యేసుప్రభువులోని ఆ మహిమను తెలిసికొనగలిగాను. యేసుప్రభువవే ఒకరిని రక్షిస్తాడు. ఎవరైనా క్రొత్త జీవితము కావాలనుకుంటే మరే మార్గము లేదు. యేసు ప్రభువే మార్గమైయున్నాడు. ఈ సత్యసువార్త అందించుటకు ప్రతి విశ్వాసి కంకణము కట్టుకోవాలి. దేవుని ప్రేమను ఇతరులకు చాటించాలి. క్రిస్మస్ శుభదినాల్లో ఎవరికైనా సువార్త చెప్పాలి. ఒక గొప్ప భక్తుని గూర్చి చదివాను. ఆ భక్తుడు కేరళ దేశము విడిచి ఆంధ్రరాష్ట్రానికి వచ్చాడు. మా నాన్నగారైన ఎ.ఎన్.మ్యాథ్యూగాని సమకాళికుడే. ఆయన చరిత్ర చదివి ఆశ్చర్యపోయాను. యేసుప్రభువు యొక్క సువార్త చెప్పకుండా అతను ఎప్పుడూ భోజనం చేయలేదట. ఎవరికైనా సువార్త చాటించిన తర్వాత భోజనం చేస్తాడట. అట్టి భక్తుల నిమిత్తం దేవునికి స్తోత్రం.

సువార్త ప్రకటింపకపోతే నాకు శ్రమ; సువార్త దేవుని శక్తి అని పౌలు భక్తుడంటున్నాడు. 'అయ్యో, నేను సువార్తను ప్రకటింపకపోయిన యెడల నాకు శ్రమ.' - 1 కొరింథీ. 9:16. 'సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి, మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియైయున్నాది.' - రోమా 1:16 సువార్త నిమిత్తము ప్రాణాలు అర్పించారు అపొస్తలులు. 'మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడును గాక. ఆయన క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదములను మనకనుగ్రహించెను.' -ఎఫెసీ 1:3. ప్రతి బహుమానము దేవుని యొద్ద నుండే వస్తుంది. యేసుక్రీస్తు కూడా పరలోకమునుండి వచ్చిన గొప్ప బహుమానము. దేవుడు లోకమును ఎంతో ప్రేమించి తన అద్వితీయ కుమారుడైన యేసుక్రీస్తును మనకు అనుగ్రహించాడు. దీని వలన మనయెడల దేవునికిగల ప్రేమ స్పష్టమగుచున్నది.

'దేవుడు ప్రేమాస్వరూపి; ప్రేమలేనివాడు దేవుని ఎరుగడు. మనము ఆయన ద్వారా జీవించునట్లు, దేవుడు తన అద్వితీయ కుమారుని లోకములోనికి పంపెను; దీనివలన దేవుడు మనయందుంచిన ప్రేమ ప్రత్యక్షపరచబడెను. మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి, మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను; ఇందులో ప్రేమయున్నది.' - 1యోహాను 4:8-10 దేవుడు ప్రభువును ఈ లోకమునకు పంపుట ద్వారా తన ప్రేమను వ్యక్తము చేసాడు. ఆయన ద్వారా మనం జీవిస్తున్నాము; బ్రతుకుతున్నాము, చలిస్తున్నాము; శక్తి పొందుతున్నాము. సాతాన్ను మన కాళ్లక్రింద చితుకత్రొక్కాలి. ఈ గొప్ప శక్తి కేవలము అపవాదిక్రియలను లయపరచడానికి నీవు అట్టి శక్తితో నింపబడుతావు. అన్నింటిమీద అధికారము పొందుతావు. ఆయన సమస్తమును నీ పాదముల క్రింద ఉంచుతాడని వాక్యము తెలియజేస్తుంది.

క్రిస్మస్ అంటేనే దేవుని ప్రేమ. తిని, త్రాగి, దినములు సుఖముగా వెళ్లబుచ్చుకొని యేసుప్రభువు ఎందుకు వచ్చాడనే సంగతి మర్చిపోవడం మహా అన్యాయం. ప్రభువు మనకొరకే వచ్చాడనే విషయం ధ్యానంలో ఉంచుకోవాలి. అందుకే పౌలుభక్తుడు చెప్పశక్యం కాని గొప్ప వరమని క్రీస్తును కొనియాడుతున్నాడు.

'క్రీస్తుయేసునకు కలిగిన ఈ మనస్సు మీరును కలిగియుండుడి. ఆయన దేవుని స్వరూపము కలిగినవాడైయుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని, తన్ను తానే రిక్తునిగా చేసికొనెను. మరియు, ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి, మరణము పొందునంతగా, అనగా సిలువమరణము పొందునంతగా విధేయత చూపినవాడై, తన్నుతాను తగ్గించుకొనెను.' - ఫిలిప్పీ 2:5-8 యేసుప్రభువు పరలోక భాగ్యాన్ని వదిలిపెట్టి ఈ లోకానికి వచ్చాడు. క్రిస్మస్ అంటే దేవుడే మానవుడైన రోజు. తండ్రి కుడిపార్శ్వమందుండే ఆ గొప్ప స్థాయిని వదిలిపెట్టి ఈ లోకానికి వచ్చాడు. అదే క్రిస్మస్. ఎందుకు లోకానికి వచ్చాడు? తండ్రి చిత్తమును నెరవేర్చుటకు మరియు సర్వలోక పాప పరిహారార్థం క్రయధనముగా తన ప్రాణాన్ని ఇవ్వడానికి వచ్చాడు. పాప క్షమాపణకు రక్తప్రోక్షణ అవశ్యకము అని పరిశుద్ధ గ్రంథములో ఉంది. రక్తము చిందింపబడకుంటే మానవాళి పాపము క్షమింపబడదు. యేసు ప్రభువు $33^{1/2}$ సంవత్సరాలు ఈలోకంలో శరీరధారిగా ఉండి తండ్రియొక్క అభిష్టాన్ని నెరవేర్చాడు. సిలువమరణం ద్వారా సర్వలోక పాపపరిహారము నిమిత్తము తన రక్తాన్ని ధారపోశాడు. అందుకే ప్రభువునందు విశ్వాసముంచువాడు ఎన్నటికిని సిగ్గుపడడు. ప్రభువునందు విశ్వాసముంచువాడు రక్షింపబడుతారని వాక్యంలో ఉంది. ఇది గొప్ప వరమై ఉంది. క్రిస్మస్ పండుగ రోజున ఒకరికొకరు బహుమానములు ఇచ్చుకుంటారు. వస్త్రాలు, వస్తువులు, మొదలైన బహుమతులు ఇస్తుంటారు, పుచ్చుకుంటుంటారు మనము ప్రేమించినవారికే మనము ఏదైనా ఇవ్వగలము. ఎవరినైతే ఎక్కువగా ప్రేమిస్తామో వారికి ఏమేమో ఇవ్వాలనుకుంటాము. అలాగే దేవుడు లోకమును ఎంతో ప్రేమించాడు. దేవుడు మనల్ని ఎంతగా ప్రేమించాడంటే తన అద్వితీయ కుమారుడైన యేసుక్రీస్తును మనకు అనుగ్రహించాడు. ఇది చెప్పశక్యముగాని దివ్యమైన వరము. ఇది మదికి అందని, వివరింపజాలని బహుమానము.

నాదొక ప్రశ్న.. నీవు ఈ దివ్యమైన బహుమానమును కలిగి ఉన్నావా? దివ్యమైన బహుమానమైన యేసుప్రభువు నాలో ఉన్నాడని నీవు ధైర్యంగా చెప్పగలవా? అనేకమైన వర్తమానములు నీవు విని ఉండవచ్చు. దేవుని వాక్యము నీయొద్దకు వచ్చింది. నీవు దేవుని వాక్యమును అంగీకరించకుండా అందరితోపాటు వచ్చి ఏదో సంతోషించి వెళ్లిపోతే దాని వలన ఏ ప్రయోజనము ఉండదు. నీవు యేసుప్రభువును నీ స్వంత రక్షకునిగా అంగీకరించాలి. యేసుప్రభువును నీ జీవితంలోకి ఆహ్వానిస్తే నీ జీవితము మారిపోతుంది. ఇంత గొప్ప బహుమానమైన యేసు ప్రభువును దేవుడు మనకొరకు అనుగ్రహించాడు. యేసుప్రభువు ఎంతగా తగ్గించుకున్నాడో అంతగా హెచ్చింపబడ్డాడు. 'అందుచేతను పరలోకమందున్న వారిలో గాని, భూమిమీద ఉన్నవారిలో గాని, భూమి క్రింద ఉన్నవారిలో గాని, ప్రతివాని మోకాలును యేసునామమున వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పైనామమును ఆయనకు అనుగ్రహించెను.' - ఫిలిప్పీ. 2:9-11 అన్ని నామముల కంటే పై నామము యేసు నామము. ఆ నామములో నీకు స్వస్థత, విడుదల, అపవాదికి ఓటమి, నీ కార్యాల్లో అభివృద్ధి, విమోచన, సమాధానము, సంతోషము, పాపక్షమాపణ లభిస్తుంది. ఇదే గొప్ప వరమై ఉంది. ఆయన మనలో ఉంటే చాలు. ఆయన మాట, చూపు, తోడు, నీడ చాలు. యేసు ప్రభువును కలిగి ఉండడం చాలా గొప్ప విషయము.

చీకటిలో, మరణఛాయలో ఉండేవారికి గొప్ప వెలుగుగా యేసుప్రభువు అరుదెంచాడని పరిశుద్ధ గ్రంథము మనకు బోధిస్తుంది. యేసు ప్రభువును రక్షకునిగా అంగీకరించినవాడు నిత్యజీవానికి వారసుడవుతాడు. 'కుమారునియందు విశ్వాసముంచువాడే నిత్యజీవముకలవాడు. కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడు గాని దేవుని ఉగ్రత వానిమీద నిలిచియుండును.' - యోహాను 3:36 కుమారునికి విధేయుడు కానివాడు జీవమును చూడడు గాని దేవుని ఉగ్రత వానిమీద నిలిచి ఉంటుంది. కావున కుమారునియందు విశ్వాసము ఉంచాలి. ఇలాగు ఎన్నో క్రిస్మస్‌లు సంబరంగా జరుపుకొనిన సంఘటనలెన్నో దాటిపోతాయి. కాని, ప్రభువు ఈరోజు మీతో మాట్లాడుతున్నాడు ప్రభువు మీయొక్క హృదయపు ద్వారాన్ని తడుతున్నాడు. ఎవడైనను నా స్వరము విని హృదయపు తలుపులు తెరిస్తే నేను వచ్చి వానితో సహవాసము చేస్తాను, వానితో కలిసి భోజనము చేస్తానంటున్నాడు. ఎంతటి సహవాసము యేసుప్రభువు వలన నీకు కలుగుతుంది. అంగీకరించినవాడు నిత్యజీవాన్ని పొందుకుంటాడు. యేసుప్రభువును అంగీకరించుటకు ఇది సరియైన సమయము. ఎన్నో వర్తమానములు విని మీ హృదయాన్ని యేసుప్రభువుకు ఇవ్వడములేదు.

నీకు ఎంత సామర్థ్యము, తెలివి ఉన్నా నీవు బహుముఖ ప్రజ్ఞాశాలివైనా, ఎంత ధనము సంపాధించినా, ఎన్ని పేరు ప్రఖ్యాతులున్నా ఇది శాశ్వతము కాదు. దేవుడు పిలిచినప్పుడు అన్నీ విడిచి వెళ్లిపోవాల్సిందే. లోకము, దాని నటన గతించిపోతాయి. ఇవి శాశ్వతము కాదు. శరీరాశ, నేత్రాశ, జీవపుడంబము గతించిపోతాయి. కాని దేవుని చిత్తము జరిగించువాడు నిరంతరము నిలుస్తాడు. గతంలో కరెన్సీ మారినప్పుడు డబ్బు అంటేనే ప్రజలకు వెక్కసమైపోయింది. దారిపొడుగున బార్లుతీరి ఎండ, వాన తట్టుకొని ఆయాసముతో కొందరు సొలసిపోయి కుప్పకూలిపోతున్నారు. వారి అవసరతలు తీర్చుకొనుటకు వారి కష్టార్జితమైన డబ్బులకొరకు క్యూ కడుతున్నారు. ఉన్నవారేమో ఆ డబ్బును నాలాల్లో పడేస్తున్నారు. పరిశుద్ధ గ్రంథము ఎంతో స్పష్టముగా బోధిస్తుంది. యోబు గ్రంథము, యెహెజ్కేలు గ్రంథములో ప్రవక్తలు - మీరు మీ బంగారమును వీధుల్లో పడేస్తారు; మీ డబ్బులు వీధుల్లో పడేస్తారు అని ముందుగానే ప్రవచించారు. అది అక్షరాలా నెరవేరడం చూసి నేను ఆశ్చర్యపోయాను. పరిశుద్ధ గ్రంథంలో ఉన్న ప్రతి మాట అక్షరాలా నెరవేరుతుంది. ఆకాశం, భూమి గతించిపోయినా ఆయన మాటల్లో సున్నాయైనా, పొల్లైనా గతించిపోదు. కావున నీవు క్రీస్తునందు నమ్మికయుంచాలి. ఇది చెప్పశక్యంగాని గొప్పవరం అని నీవు అంగీకరించాలి. (యెహెజ్కేలు 7:19)

లోకములోనికి వెలుగు వచ్చింది. కాని జనాలు ఆ వెలుగును ప్రేమించలేదు. 'వెలుగు లోకములోనికి వచ్చెను గాని తమ క్రియలు చెడ్డవైనందున మనుష్యులు వెలుగును ప్రేమింపక చీకటినే ప్రేమించిరి. దుష్కార్యము చేయు ప్రతివాడు వెలుగును ద్వేషించును, తన క్రియలు దుష్క్రియలుగా కనబడకుండునట్లు వెలుగునొద్దకు రాడు. సత్యవర్తనుడైతే తన క్రియలు దేవునిమూలముగా చేయబడి యున్నవని ప్రత్యక్షపరచబడునట్లు వెలుగునొద్దకు వచ్చును.' - యోహాను 3:19-21. తమ క్రియలు చెడ్డవైనందున వారు (లోకము) వెలుగైన ప్రభువును తృణీకరించారు. లోకములోనికి వెలుగు వచ్చింది. చీకటిలో మరణచ్ఛాయలో ఉండేవారికి గొప్ప వెలుగు అని యేసుప్రభువు పుట్టుకకు 700 సంవత్సరాల ముందు యెషయా ప్రవక్త ప్రవచించాడు. యేసుప్రభువును గూర్చిన గొప్పవార్త ప్రకటింపబడింది. 'చీకటిలో నడుచు జనులు గొప్ప వెలుగును చూచుచున్నారు. మరణచ్ఛాయగల దేశ నివాసుల మీద వెలుగు ప్రకాశించును.' - యెషయా 9:2. కాని మనుష్యులు ఈ వెలుగును ప్రేమించలేదు. పాపము చేసేవారు ఈ వెలుగును ద్వేషిస్తారు. వారి క్రియలు చెడ్డవైనందున వారు వెలుగు నొద్దకు రాడు. కాని, వెలుగు నొద్దకు వచ్చిన మనము దేవుని స్తుతించబద్ధులమై ఉన్నాము.

'ఆయనలో జీవముండెను; ఆ జీవము మనుష్యులకు వెలుగైయుండెను. ఆ వెలుగు చీకటిలో ప్రకాశించుచున్నది గాని చీకటి దాని గ్రహింపకుండెను.' - యోహాను 1:4,5. చెప్పశక్యముగాని వరమే ఈ వెలుగైన క్రీస్తు. ఈ వరము మనుష్యులకు జీవము ఇచ్చునది. ఇంతగా వాక్యము ప్రకటింపబడుచున్నా యేసుప్రభువు యొక్క మొదటి రాకడ ఆయన పుట్టుకను గూర్చిన శుభవార్త సర్వలోకమునకు ప్రచురము కాలేదు. సువార్త మారుమ్రోగుతున్నా ఇంకా ప్రజలు మిగిలి ఉన్నారు. ఇంకా ఎక్కువ వేగముగా సువార్త ప్రకటింపబడాలి. దేవుని మొదటి రాకడ గూర్చి తెలియని వారికి ఆయన రెండవ రాకడ ఏలాగు అర్థం అవుతుంది? కాబట్టి ఈ గొప్ప సువార్త అందించే బాధ్యత మనపై ఉంది. ఆనాడు గొఱ్ఱెల కాపరులు వడిగా గ్రామాలకు వెళ్లి వారు విన్న సువార్తను అందించారు. దావీదు పట్టణమందు నేడు మనకొరకు రక్షకుడు పుట్టియున్నాడు. ఆయన ప్రభువైన క్రీస్తు, లోకరక్షకుడని ప్రకటించారు.

'నా మాట విని నన్ను పంపినవానియందు విశ్వాసముంచువాడు నిత్యజీవము గలవాడు; వాడు తీర్పులోనికి రాక మరణములో నుండి జీవములోనికి దాటియున్నాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను' - యోహాను 5:24.

## క్రిస్మస్ బహుమానము యొక్క ప్రత్యేకత

### 1. అడుగని బహుమానము :

మనము ఈ బహుమానమును అడిగి పొందుకోలేము. అడగకుండానే మనకు దేవునివలన అనుగ్రహింపబడ్డాడు. దేవుడు ఆహాజు రాజుతో - నీకు ఇష్టమైంది ఒకటి అడుగు నేనిస్తాను. అది పాతాళమంత లోతైనా, ఆకాశమంత ఎత్తైన అది నీకు ఇస్తానని సెలవిస్తున్నాడు. 'యెహోవా ఇంకను ఆహాజునకు ఈలాగు సెలవిచ్చెను - నీ దేవుడైన యెహోవా వలన సూచన నడుగుము. అది పాతాళమంత లోతైనను సరే ఊర్ధ్వలోకమంత ఎత్తయినను సరే. ఆహాజు - నేను అడుగను యెహోవాను శోధింపనని చెప్పగా అతడు - ఈలాగు చెప్పెను, దావీదు వంశస్థులారా, వినుడి; మనుష్యులను విసికించుట చాలదనుకొని నా దేవునికూడా విసికింతురా? కాబట్టి ప్రభువు తానే యొక సూచన మీకు చూపును. ఆలకించుడి, కన్యక గర్భవతియై కుమారుని కని అతనికి ఇమ్మానుయేలను పేరు పెట్టును.' - యెషయా 7:1-14. యేసుప్రభువు మనం అడగకుండా దొరికిన బహుమానం మనము ఎవ్వరము అడగలేదు, కోరుకోలేదు. దేవుడే స్వయంగా మనలనందరిని ప్రేమించి కన్యక ద్వారాతన ప్రవచన వాక్కులను నెరవేర్చాడు. తానే ఒక సూచన చూపుతాడు. కన్యక గర్భవతియై కుమారుని కంటుంది. అతనికి ఇమ్మానుయేలని పేరుపెట్టును. ఇమ్మానుయేలు అంటే దేవుడు మనకు తోడు అని అర్థము. అనగా ఈ బహుమానము పాతగిల్లదు; నిన్ను వదిలి పెట్టిపోదు. చెప్పశక్యముగాని ఈ వరము ఎల్లప్పుడూ నీతోనే ఉంటుంది. దేవునికి స్తోత్రము. మనము ఎంతో మిక్కటముగా ప్రేమించి వారికి దగ్గరైపోతాము గాని వారు ఎప్పుడూ మనతో ఉండరు. కాని ప్రభువైతే ఇమ్మానుయేలు అనే పేరుతో నీకష్టకాలంలో, సుఖంగా ఉన్నప్పుడు, నీ సంతోషవేళలో, దుఃఖ వేళలో ఎల్లప్పుడు నీ చెయ్యి విడువకుండా నీ తోడుండేవాడు. నరులందరు విడచిన ప్రభువెప్పుడు నిన్ను విడువడు. గనుకనే ఈయన మనము అడుగని బహుమానము.

### 2. అపారమైన బహుమానము :

ఈయన అపారమైన బహుమానము, యేసుప్రభువును నీ హృదయములో స్వీకరించిన తర్వాత నీ అభివృద్ధి అంచెలంచెలుగా పెరిగిపోతుంది. 'ఇది మొదలుకొని మితిలేకుండ దానికి వృద్ధియు క్షేమమును కలుగునట్లు సర్వకాలము దావీదు సింహాసనమును రాజ్యమును నియమించును. న్యాయమువలనను నీతివలనను రాజ్యమును స్థిరపరచుటకు అతడు సింహాసీనుడై రాజ్యపరిపాలన చేయును. సైన్యములకధిపతియగు యెహోవా ఆసక్తికలిగి దీనిని నెరవేర్చును' -యెషయా 9:7. ప్రభువును అంగీకరించకముందు నీ స్థితి ఏంటి? ప్రభువును అంగీకరించిన తర్వాత నీ పరిస్థితి ఏంటి? అంటే ప్రభువు యొక్క మహిమ తప్ప మరియొకటి కాదు. యేసుప్రభువును నీ జీవితములోకి అంగీకరించిన తర్వాత ఎంతో వృద్ధి కలుగుతుంది. దేవుడు నీకు వృద్ధి, క్షేమం కలుగజేస్తాడు. ఈ అపారమైన బహుమానం ద్వారా నీకు మితిలేని ఆశీర్వాదాలు లభిస్తాయి.

### 3. కృపా బహుమానము :

'మీరు విశ్వాసము ద్వారా కృప చేతనే రక్షింపబడియున్నారు; ఇది మా వలన కలిగినది కాదు, దేవుని వరమే' - ఎఫెసీ 2:8. రక్షణ కార్యము మనవలన కలిగినది కాదు. కేవలము దేవుని యొక్క ఉచితమైన కృప. ఇది దేవుని వరము. ఈ దివ్యమైన బహుమానము పరమునుండి మనకు అనుగ్రహింపబడినది. పరమందున్న దేవుడు యేసుప్రభువనే బహుమానాన్ని మనకొరకు అనుగ్రహించాడు.

### 4. మారని బహుమానము :

ఈ బహుమానము మార్పులేనిది, మారనిది. మనుష్యులు మారిపోతారు. మొదట ప్రేమిస్తారు, తర్వాత వారిప్రేమ తరిగిపోతుంది. కాని అపారమైన ఈ బహుమానము తరిగిపోనిది. 'యేసుక్రీస్తు నిన్న, నేడు, ఒక్కటేరీతిగా ఉన్నాడు; అవును యుగయుగములకును ఒక్కటేరీతిగా ఉండును' - హెబ్రీ.13:8. మనుష్యులు, స్థితిగతులు, నీవు అనుకున్న ఆశ్రయాలు, లోకం, చట్టం, ప్రభుత్వం, అధికారము మారిపోతుంది కాని ప్రభువు ఎన్నడు మారడు. ఎన్నడూ మార్పునొందని బహుమానం యేసుప్రభువు.

## పరిశుద్ధ గ్రంథములో కొందరు ఒకరికొకరు బహుమానములు ఇచ్చుకున్నారు వీటిలో ఏది అత్యంత ప్రాముఖ్యమైన బహుమానమో తెలిసికుందాము

### 1. ఒకరాజు మరియొక రాజుకు ఇచ్చిన బహుమానము :

ఒక రాజు మరియొక రాజుకు బహుమానము ఇచ్చాడు. 'సొలొమోను యెహోవా మందిరమును రాజనగరును ఈ రెండింటిని యిరువది సంవత్సరములలోగా కట్టించెను. అతడు పని ముగించిన తరువాత తూరు రాజైన హీరాము సొలొమోను కోరినంత మట్టుకు దేవదారు మ్రానులను సరళవృక్షపు మ్రానులను బంగారమును అతనికిచ్చియున్నందున సొలొమోను గలిలయ దేశమందున్న యిరువది పట్టణములను హీరాము కప్పగించెను. హీరాము సొలొమోను తనకిచ్చిన పట్టణములను చూచుటకు తూరునుండి రాగా అవి అతని దృష్టికి అనుకూలమైనదిగా కనబడలేదు గనుక నా సహోదరుడా, నీవు నాకిచ్చిన ఈ పట్టణములు ఏపాటివనెను. నేటి వరకు వాటికి కాబూల్ (నిష్ ప్రయోజనము) అని పేరు. హీరాము రెండువందల నలువది మణుగుల బంగారమును రాజునకు పంపించెను' - 1 రాజులు 9:10-14. హీరాము రాజుకు సొలొమోను రాజు తను పొందిన సహాయమునకు బదులు 20 పట్టణములను బహుమతిగా ఇస్తాడు. ఆ బహుమానము హీరాముకు అనుకూలమైనదిగా కనబడనందున ఆ 20 పట్టణములు నిష్ ప్రయోజనము అంటాడు. కాని, చెప్పశక్యము కాని వరమైన యేసుక్రీస్తు ద్వారా నీకు క్షణక్షణం, అణువణువునా ప్రయోజనమే.

### 2. ఒక రాణి ఒక రాజుకు ఇచ్చిన బహుమానము :

షెబ దేశపు రాణి సొలొమోను మహారాజుకు గొప్ప బహుమానము ఇస్తుంది. 'మరియు ఆమె రాజునకు రెండువందల నలువది మణుగుల బంగారమును, బహు విస్తారమైన గంధవర్గమును, రత్నములను ఇచ్చెను. షెబ దేశపు రాణి రాజైన సొలొమోనుకు ఇచ్చిన గంధవర్గములంత విస్తారము మరి ఎన్నడైనను రాలేదు. ...సొలొమోను తన ప్రభావమునకు తగినట్టు షెబ దేశపు రాణికిచ్చినది పోగ ఆమె కోరిన ప్రకారము ఆమె యిచ్ఛాపూర్తిగా ఆమెకిచ్చెను; అప్పుడు ఆమెయు ఆమె సేవకులును తమ దేశమునకు తిరిగి వెళ్లిరి' - 1 రాజులు 10:10-13. షెబా దేశపు రాణి సొలొమోనుకు బహుమానం ఇచ్చింది. సొలొమోను తన ప్రభావమునకు తగినట్టు, ఆమె కోరిన ప్రకారము ఆమెకు ఇచ్చాడు. కాని అంతకంటే గొప్ప బహుమానము యేసుప్రభువు. మీకు ఎవరైనా బంగారము ఇస్తే మురిసిపోకండి. బంగారం, డబ్బులు ఉన్నవారికి నెమ్మది లేకుండా ఉన్న దినాలివి. డబ్బు ఏమాత్రం నీకు నెమ్మది ఇవ్వదని వార్తల్లో చూస్తున్నాము.

మా తండ్రి గారైన కీ.శే.పాస్టర్ ఎ.ఎన్.మాథ్యూ గారు సువార్తసేవ నిమిత్తం కేరళ రాష్ట్రము విడిచి ఆంధ్రా రాష్ట్రమునకు వస్తున్నప్పుడు మా నాన్నమ్మ అతన్ని పిలిచి - నీవు తెలియని దేశానికి సువార్త నిమిత్తమై వెళ్తున్నావు; దేవుని సేవాడబ్బు దేవుని సేవకొరకే వాడు. అది వెనకేసుకోకు, దానిలో నీవు తీసుకోవద్దు అని చెవిలో చెప్పింది. దైవ సేవకులు దీన్ని గ్రహించాలి. నీవు సువార్త సేవ చేయడానికే జనులు నీకు ధనాన్ని ఇస్తున్నారు. ఆ ధనం నీ కొరకు కూడబెట్టుకొనుటకు, నీ మిద్దెలు మేడలు కట్టుకొనుటకు, నీ పిల్లల కొరకు ఖర్చు పెట్టడానికి కాదు. ఎందరో సువార్త తెలియక నశిస్తున్నారు. చెప్పశక్యం గాని గొప్ప వరాన్ని ప్రకటించుటకే డబ్బు మీ యొద్దకు వచ్చింది. గనుక దాన్ని కూడబెట్టుట శాపగ్రస్తం. ఆ డబ్బు యేసు ప్రభువు యొక్క రక్త క్రయధనము. మనుష్యుటు కష్టించి రక్తాన్ని చెమటగా మార్చి దశమభాగములు, కానుకలు తెచ్చి నీకు ఇస్తే నీవు వాటిని దుర్వినియోగం చేసి నీ స్వార్థం కొరకు వాడి నిన్ను నీవు పైకెత్తుకుంటే దేవుని ఉగ్రత నీ మీదకు వస్తుంది. అనేకులు- అమ్మ, మీరు ఇంత గొప్ప సేవ చేస్తున్నారు. ఒక్కసారైనా డబ్బులు అడగరు అంటారు. అవును నేను సమస్తమును ధారాళంగా అనుగ్రహించే దేవునియందు విశ్వసిస్తున్నాను. ఆయన నా ప్రతి అక్కర తీరుస్తాడు. నా ఉద్యోగము వదిలి దేవుని పిలుపు మేర సేవలోకి వచ్చాను. దేవుడు సువార్త సేవకు అంధకారస్థలంలోని నిధిని, రహస్యమందు మరుగైన ధనాన్ని ఇస్తాడు; జనముల ఐశ్వర్యము నీవు అనుభవిస్తావు. అది ఒడ్డుమీద పొర్లిపారు ప్రవాహమువలె నీయొద్దకు వస్తుంది. పాపాత్ముల ఆస్థి నీ యొద్దకు వస్తుంది. సముద్ర వ్యాపారాన్ని దేవుడు తన పనికొరకు నీవైపు త్రిప్పగలడు. కావున ఇన్ని సంత్సరాలు హుందాతనంతో దేవుని సేవ చేయగలిగాను. దేవునికి స్తోత్రము.


కావున నీవు పొందిన వెలుగును ఇతరులకు అందించాలి. నీవు దేవునిలో అనుభవిస్తున్న ఆనందము ఇతరులతో పంచుకోవాలి. యేసుప్రభువు - మీరు మీ దీపాన్ని వెలిగించి మంచము క్రింద, కుంచెము క్రింద పెట్టకుండా ఎత్తిపట్టుకోమని చెప్పాడు. నీవు దివ్యమైన బహుమానాన్ని దినంలో ఒకరికైనా తెలియజేయాలి. ఇంతుకు ముందు నేను వివరించిన విషయంలో సువార్త ప్రకటించకుండా ఆహారం పుచ్చుకొనని ఆ దైవ సేవకుడు ఒకరోజు ఓ రిక్షాలో వెళ్తు రిక్షా నడిపించే వ్యక్తికి ఈ గొప్ప బహుమానం గూర్చి తెలియజేసాడు. ప్రభువును నమ్మితే పాపాలు పోతాయి, సంతోషం అనుగ్రహిస్తాడని చెబితే నిజంగా తాను పాపాలు చేసి అలసియున్నానని తన జీవితంలో సంతోషం లేదని ఆ వ్యక్తి యేసు గూర్చిన వార్త విని తన జీవితాన్ని యేసుప్రభువుకు అప్పగించి రక్షణ పొందాడు. ఈ దైవజనుడు రిక్షానడిపే ఆ వ్యక్తికి బాప్తిస్మమిచ్చాడు. ఇప్పుడు ఆ రిక్షా నడిపే వ్యక్తి గొప్ప కాపరియై వందల సంఘాలను స్థాపించాడు. సువార్త దేవుని శక్తి.

మీరు ఈ విషయాలన్నీ తెలుసుకోవాలి. నేను ఊరికే సేవలోనికి రాలేదు. ఒక మొద్దునుండి చిగురు వలె మేము వచ్చాము. ప్రాణాలు పనంగా పెట్టి జీవితాలు త్యాగము చేసి ఆకలి బాధ, హింసలు, ఉపద్రవము, వస్త్రహీనత, చెరసాల, దెబ్బలు ఇవన్నీ సువార్త నిమిత్తం మా నాన్నగారైన ఎ.ఎన్.మాథ్యూ గారు అనుభవించారు. అందుకే సేవ ఈ రీతిగా జరుగుతుంది. ఇది ఆగిపోదు. సూర్యుడున్నంతకాలం, రాకడ పర్యంతం ఇది జరుగుతుంది.

ఒక రాజు మరియొక రాజుకిచ్చిన బహుమానము నిష్ ప్రయోజనమైంది. ఒక రాణి రాజుకిచ్చిన బహుమానం అతని గొప్పతనానికి సరిపోలేదు. ఆమె ఇచ్చిన దానికి రెట్టింపు రాజు ఆమెకిచ్చి పంపాడు.

### 3. మానవులు దేవునికి ఇచ్చిన బహుమానము :

క్రిస్మస్ సమయంలో మనము జ్ఞాపకము చేసికుంటాము. జ్ఞానులు బంగారం, సాంబ్రాణి, బోళము యేసుప్రభువుకు బహుకరించారు.



డా.జాయ్ చెరియన్
యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్
రాం నగర్, (హైద్రాబాద్)

'వారు ఆ నక్షత్రమును చూచి, అత్యానందభరితులై ఇంటిలోనికి వచ్చి, తల్లియైన మరియను ఆ శిశువును చూచి, సాగిలపడి, ఆయనను పూజించి, తమ పెట్టెలు విప్పి, బంగారమును సాంబ్రాణి బోళమును కానుకలుగా ఆయనకు సమర్పించిరి' - మత్తయి 2:10,11. వారు ఆ నక్షత్రమును చూసి ఆనందంతో ఆ ఇంటిలోనికి వెళ్లి బాలయేసును చూసి ఆరాధిస్తూ సంతోషిస్తున్నారు. బంగారము, సాంబ్రాణి, బోళము అర్పిస్తున్నారు. బంగారము రాజరికానికి సాదృశ్యము, సాంబ్రాణి యాజకత్తమునకు, బోళము ప్రభువు యొక్క మరణమునకు సూచనగా ఉన్నాయి.

4. దేవుడే సర్వమానవాళికి ఇచ్చిన అపారమైన బహుమానము వీటన్నిటికంటే అనంతమైనది అతీతమైనది క్రీస్తు అనే బహుమానము. దేవుడు మనకిచ్చిన ఈ గొప్ప బహుమానమునకై ఎల్లప్పుడు కృతజ్ఞులమై ఉండాలి. నేను ఈ మార్గములోనికి రావడానికి కొన్ని కార్యాలు నా మదిలో మెలిగినవి. నేను ఓ భక్తిగల కుటుంబములో గొప్ప దైవజనుని కడుపులో పుట్టినా అంత త్వరగా నేను యేసుప్రభువును నమ్మలేదు. నేను ఇంటర్మీడియట్ చదివే దినాల్లో ప్రభువుకు చాలా దూరంగా ఉన్నాను. నాకు విసుగుపుట్టింది. ఎప్పుడు చూసినా కూడికలు, జనాలు ఇంటికి రావడం, మా అమ్మగారు నాన్నగారు ఎప్పుడు బిజీగా ఉండడం, వచ్చిన వారికి వండడం వారికి పరిచర్యలో అమ్మ నిమగ్నమై ఉండడం చూసి విసిగివేసారాను. ఉదయం నుండి రాత్రి వరకు ఇదే పని అని సణిగేదాన్ని, నేను అందరికన్నా వ్యతిరేక స్వభావంగలదాన్ని గనుక నాకు ఈ మార్గమే వద్దు అనుకున్నారు. దేవుడే లేడనే ఓ గుంపును కాలేజీలో ఆరంభించాను. ఆ గుంపుకు నేను నాయకురాలిని. అయితే మా అన్నగారైన పాస్టర్ ఎ.ఎం.అబ్రాహాము గారు - జాయ్ నీవు నడిచే మార్గము సరియైనది కాదు; నేను నీ కొరకు ప్రార్థిస్తున్నానని చెప్పారు. నా తలిదండ్రులు కన్నీళ్లతో ప్రారంభించారు. తర్వాత నాకు వివాహం జరిగింది. వారిది మంచి సంపన్న కుటుంబము. బంగారము, ఆస్తులుగలవారు. వారింటికి నేను వెళ్లినప్పుడు ఏనుగులు తొండములు ఊపుతున్నాయి. దైవజనుని కుటుంబములో పుట్టిన నేను ఇలాంటి ఇంట్లో ఏమి చేయాలో అర్థం కాలేదు. కాని దేవుని మహా దయవలన ప్రభువును తెలుసుకున్న తర్వాత నా జీవితం పూర్తిగా మారిపోయింది. బంగారం, ధనం మీదగాక నా దృష్టి ప్రభువు మీదకు మళ్లింది. ప్రభువే నాకు పాలు, స్వాస్థ్యం, సమస్తమని తెలుసుకోగలిగాను. బంగారమును, లోకమును ఎక్కువగా ప్రేమించిన నేను మా ప్రథమ కుమార్తె తార మరణానంతరము దేవుని చిత్తాన్ని నా జీవితంలో నెరవేర్చాలని నన్ను నేను దేవునికి సమర్పించుకున్నాను. చాలా రంగురంగులుగా బ్రతకాలని ఆశ, ఎంతెంతో సంపాదించాలనుకున్నాను. కాని, యేసుప్రభువు చాలినవాడు, సరిపోయినవాడు అనే ఈ బహుమానముతో నేను సంతృప్తినొందాను. ఈ బహుమానమే గొప్ప సంతోషానికి కారణమైంది. ఈ బహుమానమే నన్ను తన ఆత్మతో నింపి గొప్ప పరిచర్య చేయడానికి కారణమైంది. అప్పటి నుండి దేవుని వాక్యం చదువుటకు పూనుకున్నాను. దేవుడు తన మహాకనికరం ద్వారా నన్ను తన సేవకొరకు ఏర్పాటుచేసుకున్నాడు. చెప్పశక్యంగాని వరం ఎలాంటి వరాలనైనా నీకు అనుగ్రహిస్తుంది. తెలుగు ప్రజలకు నేను సేవలు అందించాలంటే నాకు తెలుగు భాష రావాలి. 50 రోజులు దేవుని సన్నిధిలో ప్రార్థించాను. నాతల్లి కీ.శే.రేచెల్ మాథ్యూగారు - నీవు తెలుగు మాట్లాడేవారి కంటే అద్భుతంగా తెలుగు మాట్లాడబోతున్నావని ప్రవచించింది. ఇప్పుడు తెలుగులోనే ప్రభువు పరిచర్య చేస్తున్నాను.

## క్రిస్మస్ బహుమానము మనకు తెలియజేసిన ఏడు మర్మములు

1. యేసు - నేనే మార్గమును, సత్యము, జీవమును యేసు ప్రభువు ఒక్కడే లోకంలో నేనే మార్గము, సత్యము, జీవమును అని చెప్పాడు. 'యేసు - నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు' -యోహాను14:6. ఏ యుగపురుషుడు, మహా వ్యక్తులు చెప్పని మాటలు ప్రభువు చెప్పాడు.

### 2. యేసు - నేను లోకమునకు వెలుగును :

'మరల యేసు - నేను లోకమునకు వెలుగును; నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగుగలిగియుండునని వారితో చెప్పెను' - యోహాను 8:12. నేను లోకమునకు వెలుగు అని ఇంతవరకు ఎవ్వరు చెప్పలేదు. ప్రభువే లోకమునకు వెలుగైయున్నాడు.

### 3. నేను నిజమైన ద్రాక్షావల్లిని :

'నేను నిజమైన ద్రాక్షావల్లిని, నా తండ్రి వ్యవసాయకుడు' - యోహాను 15:1. నేను నిజమైన ద్రాక్షావల్లిని నేనే; నా తండ్రి వ్యవసాయకుడు. మీరు నాయందు నిలచి ఉంటే మీరు బహుగా ఫలిస్తారు. మీరు బహుగా ఫలించుట ద్వారా నా తండ్రి మహిమపరచబడునని చెప్పాడు.

### 4. యేసు - పునరుత్థానమును జీవమును నేనే :

'అందుకు యేసు - పునరుత్థానమును జీవమును నేనే; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును' - యోహాను 11:25. దేవుళ్లని చెప్పుకొనే వారెవ్వరూ ఈ గొప్పమాట పలుకలేదు. పునరుత్థానము, జీవము క్రీస్తే.

### 5. జీవాహారము నేనే :

'అందుకు యేసు వారితో ఇట్లనెను - జీవాహారము నేనే; నాయొద్దకు వచ్చువాడు ఏమాత్రమును ఆకలిగొనడు, నాయందు విశ్వాసముంచువాడు ఎప్పుడును దప్పిగొనడు' - యోహాను 6:35. పరలోకమునుండి దిగివచ్చిన జీవాహారము నేనే అని ప్రభువు ఒక్కడే చెప్పాడు.

### 6. నేనే ద్వారమును :

'నేనే ద్వారమును; నా ద్వారా ఎవడైన లోపల ప్రవేశించిన యెడల వాడు రక్షింపబడినవాడై, లోపలికిపోవుచు బయటికి వచ్చుచు మేత మేయుచునుండును' - యోహాను 10:9. గొఱ్ఱెలుపోవు ద్వారమును నేనే. నా ద్వారానే మీరు లోనికి ప్రవేశించి రక్షింపబడినవారైయుంటారు.

### 7. నేను గొఱ్ఱెలకు మంచి కాపరిని :

'నేను గొఱ్ఱెలకు మంచి కాపరిని; మంచి కాపరి గొఱ్ఱెల కొరకు తన ప్రాణమున పెట్టును' - యోహాను 10:11. నేను గొఱ్ఱెలకు మంచి కాపరిని. మంచి కాపరి తన గొఱ్ఱెల కొరకు ప్రాణము పెట్టునని చెప్పాడు. అలాగే యేసుప్రభువు మానవుల రక్షణ కొరకు తన్నుతాను అర్పించుకొని మనకు విడుదల, రక్షణ నిత్యజీవం అనుగ్రహించాడు.

అందుకే పౌలు భక్తుడు యేసుప్రభువును చెప్పశక్యముగాని గొప్ప వరమని చెప్పి ఆయనను కొనియాడుతున్నాడు. ఈ క్రిస్మస్ దినాల్లో మీరు ఈ దివ్యమైన బహుమానమును పొందుకోవాలని దేవుని సేవకురాలిగా మిమ్మును కోరుచున్నాను. ఇంకను నీవు యేసుప్రభువును విశ్వసించనిచో ఇదే అనుకూల సమయము. ఈ సువార్తను నమ్మాలి. పరిశుద్ధ గ్రంథము ఘోషిస్తుంది వేరే మార్గము లేదు. ఈ లోకము అశాశ్వతము. కోట్ల రూపాయలు సంపాదించినవారు ఒక్క రూపాయి కూడా వెంట తీసికెళ్లలేరు. టన్నులకొద్ది బంగారము కూర్చుకున్నవారు ఇసుమంత బంగారమును కూడా తీసికొని వెళ్లలేరు. ఆస్తులు సంపాధించినవారి వెంట ఏదీ వెళ్లదు. యోబు భక్తుడు - నేను ఈ లోకమునకు దిగంబరినై వచ్చాను. దిగంబరినై లోకములోనుండి వెళ్లిపోతాను. నేను లోకమునకు ఏమీ తీసికొని రాలేదు; ఏమియూ తీసికొని వెళ్లను. కావున మన్నైనది మంటికి మారుతుంది. ఆత్మ దేవుని యొద్దకు వెళ్లాలి. యేసుక్రీస్తునందు విశ్వాసముంచువాడు నశింపక నిత్యజీవం పొందునట్లు చెప్పశక్యముగాని గొప్పవరాన్ని పరలోకపు తండ్రి మనకు అనుగ్రహించాడు. యేసుక్రీస్తు దేవుడని, ఆయన నా కొరకు సిలువలో మరణించాడని, ఆయన చిందించిన రక్తము ద్వారా నాకు పాపక్షమాపణ కలుగుతుందని, ఆయన మరణించి మూడవ దినమున తిరిగిలేచి పరలోకమునకు ఆరోహణుడై నా కొరకు విజ్ఞాపణ చేయుచున్నాడని నీ హృదయమందు విశ్వసించి నోటితో ఒప్పుకుంటే నీవు రక్షింపబడతావు. కావున నీ హృదయం ప్రభువుకొరకు తెరవాలి. నీకు రక్షణ లేకుంటే దేవుని ఉగ్రత నీమీద నిలిచి ఉంటుందని వాక్యము స్పష్టంగా చెబుతుంది. గనుక నీవు ఈ వరాన్ని కలిగి ఉండాలి. చెప్పశక్యముగాని ఈ వరంతో దేవుడు మనలందరిని నింపునుగాక. ప్రభువును ఎరుగనివారికి కూడా ఈ వరాన్ని పరిచయము చేయాలని మనవి చేస్తున్నాను. 'ఒకడు సర్వలోకమును సంపాదించొని తన ప్రాణమును పోగొట్టుకొనుట వానికేమి ప్రయోజనము?' - మార్కు 8:36. అని ప్రభువు అంటున్నాడు. ఆలోచించండి!



**మనుషులు జన్మతో పాపులు!** : రెవ.డా.పి.యేసుపాదం (విశాఖ)
**ఇది వాక్యానుసారమా? కాదా?** పాఠకుల స్పందనను కోరుతున్నాం. మీ స్పందన వాట్సప్‌లో కూడా పంపొచ్చు. నెంబర్ : 7981542666 / 8333012184

## ఏది మన దేశానికిప్పుడు అవసరం?

# నాగరికతా? సౌవార్తీకరణా?



బిషప్.ఎం.ఎ.పాల్

**అ**త్యంత అద్భుతమైన నామమైన నా ప్రభువైన యేసుక్రీస్తు నామములో మీకు శుభములు తెలియజేయుచున్నాను.

అమితంగా పెరిగిపోవుచున్న జనాభాకు తగినట్లుగా సౌవార్తీకరణ చేయుటలో సంఘము వైఫల్యత చెందింది.

అధిక జనాభా కలిగిన దేశాలలో మన దేశం ఒకటి. మన దేశ ప్రజల అవసరతలను తీర్చుట అనేటువంటి ఒక గొప్ప సవాలు మనముందున్నది. సాంకేతిక పరిజ్ఞానములోను, విద్యారంగములోను, వైద్యపరం గాను కూడా మన దేశం ఉన్నత శిఖరాలను చేరుకుంది. ఇతర దేశాల వారు కూడా మన దేశ ప్రజలను వారి దేశ అవసరతలకోసం ఆయా రంగాలలో ఉన్నవారిని వాడుకుంటున్నారు. అయితే ఆత్మీయ ఎదుగుదలలో చూస్తే ఇటువంటి ఉన్నతమైన స్థానాలలోనికి వెళ్ళలేకపోతున్నారు. ఇటువంటి ఉన్నత స్థానాలలో ఉండవలసిన వారు చాలా మంది నైతిక విలువలే లేని భయంకరమైన సమాజంలో దిగజారిపోయిన స్థితిలోనున్నారు. మానవుడు శారీరకంగా, సమాజపరంగా, మానసికంగా, ఆత్మీయంగా పతనమవడానికి లేదా దిగజారిపోవడానికి గల కారణం నైతిక విలువలను మరచి అన్యాయము నాశ్రయించి జీవించడమే. ఎక్కడ చూసిన పాపము ప్రతిచోట ఉనికిని కలిగియున్నది. పాపము మానవత్వంపైన ప్రభుత్వం చేస్తుంది. మనుష్యులు అనేక రంగాలలో అన్యాయస్తులు గాను, అక్రమము చేయువారిగాను మారిపోతున్నారు. మతముగాని, విద్యగాని భూమి మీద నివసిస్తున్న ఏ ఒక్క మనుష్యుని జీవితంపై మార్పు తెచ్చే విషయంలో ఎటువంటి ప్రభావాన్ని చూపడంలో విఫలమైపోయాయి. వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా, సమాజపరంగా, ఆత్మీయ జీవితంలో మనముండవలసిన స్థితిలో లేమని ప్రప్రథమంగా మనము గుర్తించ బద్ధులమైయున్నాము. మనుష్యులలో అనేకమంది వారి జీవితాలలో ప్రాముఖ్యతను దేనికివ్వాలో గుర్తించలేక అలక్ష్యం చేస్తున్నారు. ఈ కారణంగా సమాజంలోనే కాదు సంఘములో సహితం నిరాశ చెందిన వారు, ఓడిపోయినవారు, కృంగిపోయిన వారుగా ఉన్నారు.

విద్య మరియు మత సంబంధిత సంస్థలలో కూడా ప్రయోజనం లేని నాయకత్వము కారణంగా ఈనాడు మనదేశం అనేకమైన సమస్యలకు నిలయంగా మారింది. అనేక సమస్యలనెదుర్కొంటుంది. ఉన్నతమైన స్థానాలలో అనర్హమైన వ్యక్తులు ఉండటాన్ని గుర్తించిన యువతరం ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. నైతికవిలువలనేవి పూర్తిగా దిగజారిపోయినట్లే. ప్రస్తుత దినాలలో వైఫల్యాలన్నిటికీ మించిన వైఫల్యత ఏమంటే దేవుని సంఘము మతాచారాలకు, మావన ఆజ్ఞలకు ప్రాధాన్యత నివ్వడం.

'ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురుగాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది; మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు' (మత్తయి 15:9)

నిష్ణాతులు, గొప్ప తలాంతులు గలవారు, విద్యావంతులు ఉన్నారు గాని, అందరూ దేవుని చేత అభిషేకించిన వారు కారు.

ఇటువంటి సంకట స్థితిలో నున్న దేశాన్ని దృష్టిలో నుంచుకొని నానాటికీ పెరిగిపోతున్న జనాభా యొక్క అవసరతలను తీర్చవలసిన బాధ్యత సంఘము మీదనే ఉన్నదను విషయాన్ని గుర్తించాలి. విసిగి వేసారి, అలసి సొలసి యున్న మనుష్యుడు తిరిగి ప్రశాంత జీవన విధానంలోనికి నడిపించబడుట అనే గొప్ప ఉజ్జీవం సంఘములో రావాలి. క్రైస్తవులు ఇటువంటి అనుభం లోనికి రావడం ఒక నూతన జీవిత విధానాన్ని సంతరించుకోవడం. ఈ సమృద్ధి యేసుక్రీస్తు నందు వాగ్దానము చేయబడినది. ఇలాంటి ఉజ్జీవము ఒక్క నూతన పరచబడటమేకాదు గాని పెరిగిపోతున్న భయంకరమైన పాపమును గూర్చి ఒప్పింపజేస్తుంది. పాప ప్రక్షాళన చేసి నూతన జీవితాన్ని యిస్తుంది. అంతేకాక ఆరోపించుటకు అవకాశములేని మరియు అత్యంత అవశక్యమైన దేవుని వాక్యమునకు స్పందించేలా చేస్తుంది.


'ప్రత్యక్షత' అనేది దేవునితో గల సన్నిహిత సంబంధ బాంధవ్యాలు కలిగియుండుట ద్వారా కలుగుతుంది. మానవ పద్దతులకు, మానవ సలహాలకు అతీతమైనది దేవుని సంఘమునకిచ్చిన ప్రత్యక్షత. ఆ దర్శనమును సంఘము కోల్పోయినదనునది మనందరికీ తెలిసినదే. ప్రత్యక్షత లేనిచో ప్రజలు నశిస్తారు. కాబట్టి 'నశించిపోవుచున్న కోట్లాదిమంది ప్రజ లను రక్షణలోనికి నడిపంచాలి' అనేటటు వంటి ఆది సంఘపు దర్శనమును ఈనాటి సంఘము తిరిగి పొందాలి. కనుక మన దేశము యొక్క తప్పనిసరి అవసరత నాగరికత కాదు, సౌవార్తీకరణ. సౌవార్తీకరణ సంఘము యొక్క ఊపిరి. ఇది యేసుక్రీస్తు జనన, మరణ, పునరుత్థానముల వలన సంఘమునకు ఇవ్వబడింది. ప్రపంచ శాంతి, సంతోష, సమాధానాలు యేసుక్రీస్తు ద్వారానే తప్ప మరెవరి ద్వారా రానేరావు. ఈ శుభవార్త వలననే మానవులు పాపము, రోగము, దుష్టశక్తుల ప్రభావం నుండి విముక్తులవుతారు. కులము, జాతి, తెగ, మతము మరియు సంస్కృతి అనే బేధం లేకుండా ప్రతి ఒక్కరిని ప్రభావితం చేయగలిగే శక్తి ఈ శుభవార్తకు ఉన్నది. సంఘములో ఉన్న జనులను దూసుకొని పోయే అనుభవములోనికి ఉజ్జీవమే తీసుకెళుతుంది.

సౌవార్తీకరణ ద్వారా మన తరములోనే ఒక గొప్ప మార్పును చూడగలం. 'సౌవార్తీకరణ' అనేది ఒక కార్యక్రమం కాదు. ఇది పరిశుద్ధాత్ముని కార్యము. ఇది మహిమా యుక్తమైన అద్భుతమైనటువంటి పరిశు ద్ధాత్ముని యొక్క పరిచర్య.

నశించిపోవుచున్న ఈ కోట్లాది మంది ప్రజలను సువార్త ద్వారా స్పందింపచేయుటకు ఇప్పుడున్నటువంటి ఏ మానవ పద్ధతిని గాని, నీవు కాక వేరొక మంచి పురుషుని కొరకు గాని లేక స్త్రీ కొరకు గాని ఎదురు చూచుటలేదెందుకనగా ఆ దేవుడు మానవ పద్ధతులను, మంచి వారని పిలువబడే వ్యక్తులను కాదు అభిషేకించేది. అసంపూర్తిగా ఉండిపోయిన ఈ పనని దేవుని కొరకు సమర్పించుకొని, దేవునికి లోబడి, ఆయన పై ఆధారపడి, నమ్మకంగా పనిచేసే వారి కొరకు ఎదురు చూస్తున్నాడు.

మహిమాయుక్తమైన ఈ పరిచర్యలో నీవెంతవరకూ పాలుపంపులు పొందుతున్నావు? ఈ సత్యవాక్యము నందు వేరుపారి స్థిరపరచబడవలెనని నా ఆశ మరియు ప్రార్థనయైయున్నది. **దేవుడు నిన్ను దీవించును గాక!**

# ఆత్మీయ పరిణతి అవసరం



రెవ.టి.ఎ.ప్రభుకిరణ్
హైద్రాబాద్

**దే**వుడు తన స్వహస్తాలతో ఆశీర్వదించిన జీవితాలు కోట్లాదిమందికి ఆశీర్వాద కారణంగా మారుతాయి. మనం ఆశీర్వదింపబడకుండా ఇతరులకు ఆశీర్వాదంగా మారలేం. విశ్వాసులందరికీ జనకుడుగా పిలువబడే అబ్రహాముది అలాంటి జీవితమే, నిన్ను ఆశీర్వదిస్తాను, భూమిలోని సమస్త వంశాలు నీలో ఆశీర్వదించబడుతాయి; (ఆది.12:2) అన్నది అబ్రహాముకు ప్రభువిచ్చిన వాగ్ధానం. అయితే అందుకు ఒక షరతు ఉంది, నీ దేశాన్ని, బంధువులను, పూర్వ స్వభావాన్ని వదిలి నేను చూపించే దేశానికి వెళ్ళు, అన్నది ప్రభువు ఆజ్ఞ. అప్పటిదాకా వడ్డించిన విస్తరిలా ఉన్న ఆయన జీవితంలో దేవుని ఈ ఆజ్ఞ కల్లోలాన్ని రేపి ఆయన్ను ముక్కు మొహం తెలియని పరాయి దేశంలో ఒక పరదేశిగా మార్చేసింది. విశ్వాసి జీవితంలో కల్లోలాలు చెలరేగితే తప్ప అతని జీవితం ఇతరులకు ఆశీర్వాదంగా మారదు. కడలి గర్భాన్ని కల్లోలిత పరిచే పెనుతుఫానే మేఘాలుగామారి పుడమికి నీటిని దానంగా ధారపోస్తుంది. మజ్జిగను కవ్వం ఎంతగా కల్లోలితం చేస్తే, అంతటి మృదువైన వెన్న బహుమానంగా బయటికి వస్తుంది. భూలోకంలోని సమస్త వంశావళికి తనను ఆశీర్వాదంగా మార్చే దైవికప్రక్రియ 'అన్నింటినీ పోగొట్టుకోవడం' ద్వారా ప్రారంభమవుతుందన్న ఆత్మీయ సత్యాన్ని అబ్రహాము ఆరంభంలోనే నేర్చుకున్నాడు. తాను ఎదుర్కొనబోయే ప్రతి పోరాటం, నష్టం, చేదు అనుభవం ఆ దైవ కార్యంలో అంతర్భాగమేనని ఆయన గ్రహించాడు. అందుకే ఆయన గుడారాల్లో నివసిస్తూ కూడా పునాదులు కలిగిన పట్టణం కోసం ఎదురుచూసిన విశ్వాసి (హెబ్రీ 11:10) అయ్యాడు.

'కొన్ని పోగొట్టుకోవడం' అనేది అనేకులకు ఆశీర్వాదంగా మారడానికిగాను తాను చెల్లించే అతి చిన్న మూల్యం అని విశ్వాసి గ్రహించాలి. ఆశీర్వాదం అనే గమ్యానికి వెళ్లే మార్గంలో 'పోగొట్టుకోవడం' అనేది ఒక ప్రధానమైన మజిలీ! ఒక చిన్న విత్తనాన్ని పోగొట్టుకోవడానికి సిద్ధపడినవాడే ఆ తరువాత దాంట్లోంచి మొలకెత్తే ఒక మహావృక్షానికి, దాని వేలాది ఫలాలకూ యజమాని అవుతాడు. దేవుని కోసం మనం వెచ్చించేది, పోగొట్టుకునేది మన భావి జీవితం కోసం, చుట్టూ ఉన్న అనేక వేలమంది ఆశీర్వాదాల కోసం మనం చెల్లించే అతి చిన్న మూల్యం, వెచ్చించే మూలధనం అన్న ఆత్మీయ సూత్రాన్ని విశ్వాసులు అర్థం చేసుకోవాలి.

కాకపోతే ఇది లోకం నేర్పించే ఆర్థిక సూత్రాలకు పూర్తిగా భిన్నమైనది. దేవునికోసం మనం ధనం, ఆస్తులు, ఆరోగ్యం, సమయం ఇలా చివరికి మన పరువు కూడా పోగొట్టుకోవలసి వచ్చినా అది తాత్కాలికమేనని, అదే మహదానందమని భావించే ఆత్మీయ పరిణతి మనలో ఏర్పడాలి. వేలాదిమందికి ఆశీర్వాదకరంగా మారనున్న జీవితాలకు అది దేవుడు నిర్దేశించిన సూత్రమని గ్రహించాలి. బైబిలులో, చరిత్రలోని విశ్వాసులంతా, చివరికి దైవ కుమారుడైన యేసుక్రీస్తు కూడా ఇదే బాటలో నడిచారు. సాతాను మనమీద చేసే ప్రతి కుట్రనూ, పంపించే ప్రతి అవమానాన్ని దేవుడు మనకూ సంఘమంతటికీ కూడా ఆశీర్వాదంగా మార్చుతాడు. అది ముమ్మాటికీ నిజం.

# ఆది ప్రేమ



డా.పి.బి.మనోహర్
తెనాలి

టెన్నిస్ విలియమ్ గారు 1931లో "టాల్‌స్టాయ్ వ్రాసినదేమో" అనే కథ నేటి అనేకుల మనస్సులను ప్రతిబింబించేదిగా ఉంది. జాకబ్ అనే వ్యక్తి రష్యాలో ఉండేవాడు. అతని తండ్రికి ఒక పుస్తకముల షాపు ఉన్నది. లైలా అనే యువతిని జాకబ్ ప్రేమించాడు. లైలా చాలా అందమైనది. చక్కగా పాడగలదు. తండ్రి మరణాంతరము జాకబ్ పుస్తకముల షాపు యజమాని అయినాడు.

తాను ప్రేమించిన లైలాను వివాహము చేసుకొని బుక్‌స్టోర్ పైన ఉన్న మేడపై నివసించుట ప్రారంభించాడు. వారి జీవితంలోకి ఒక విలన్ ప్రవేశించాడు. వాడు లైలాను ప్రలోభపెట్టి "నీవు రష్యాలో ఉంటే ఏమి లాభము? ఎంతో చక్కగా పాడుతున్నావు. నాతో కూడ వస్తే నేను ప్రపంచమంతా నిన్ను తీసుకొని వెళ్తాను. ఐరోపా అంతటా నీ ప్రదర్శనలు ఏర్పాటు చేస్తాను" అని అన్నాడు.

లైలా పగలంతా ఇంట్లో ఉండుటకు బోర్ ఫీలగుచున్నది. అందువల్ల జాకబ్‌ను విడచి ప్రదర్శనలిచ్చుటకు వెళ్లుటకు నిర్ణయించుకొన్నది. జాకబ్ చాలా బాధపడ్డాడు. తన ఇంటి తాళము చెవి ఒకటి ఆమెకిస్తూ "నీవు ఎప్పుడైనా తిరిగి రావచ్చును. ఈ ఇల్లు నీదే. ఎప్పుడు రావాలనుకుంటే అప్పుడు నీవు రావచ్చును" అన్నాడు.

ఆమె వెళ్లిన తరువాత జాకబ్ తన బాధ మరచిపోవుటకు పుస్తకములు చదువుట ప్రారంభించాడు. సాధారణముగా అటువంటివారు మద్యపానమునకు అలవాటు పడతారు. కాని, జాకబ్ రాత్రింబగళ్లు పుస్తకములు చదువుట ప్రారంభించాడు. ఎవరితోనూ మాట్లాడేవాడు కాదు. ఇల్లు విడచి బయటకు వెళ్లేవాడు కాదు. పుస్తకముల షాపులో వెనుక భాగమున ఉన్న టేబుల్ వద్ద కూర్చుండి రోజంతా చదువుతూ ఉండేవాడు.

15 సంవత్సరములు గడచినవి. ఒకరోజు లైలా తిరిగి వచ్చినది. ఆమెను మరచిపోవుటకు జాకబ్ పుస్తకములు చదువుట ప్రారంభించాడు. అందువల్ల ఆమెను నిజముగా మర్చిపోయాడు. పుస్తకములు కొనుటకు ఆమె వచ్చిందనుకొని "మీకు ఏ పుస్తకములు కావాలండీ?" అని జాకబ్ ఆమెను అడిగాడు. జాకబ్ తనను గుర్తించలేదని లైలా షాక్ అయ్యింది. లైలా "నాకు ఒక పుస్తకము కావాలి. కాని, దానిపేరు మర్చిపోయాను" అన్నది.


"ఆ పుస్తకములో ఏముందో చెప్పగలరా?" అని జాకబ్ అడిగాడు. లైలా తమ చిన్న నాటి సంగతులు చెప్పటము ప్రారంభించింది. ఏ పార్క్‌లో కలుసుకొనేవారమో, ఏ నాటకములు చూచుటకు కలిసి వెళ్లామో, బోటులో షికారు చేస్తూ ఏలా తిరిగామో, వివాహము అయిన తరువాత బుక్ స్టోర్ పైన ఉన్న ఇంటిలో ఎలా నివసించామో చెప్పింది. గొప్ప గాయకురాలైన ఆ భార్య ప్రపంచమంతా పర్యటించినా తన భర్తను మరువలేక తిరిగి వస్తుందని చెప్పింది. ఈ కథలు చెబితే తన గతము గుర్తుకు వస్తుందని ఆమె ఆశించింది.

కాని జాకబ్‌లో ఏ చలనమూ లేదు. లైలా హతాశు రాలయ్యింది. తన హృదయములోని కోరికను అతడు మర్చిపోయాడని ఆమె గ్రహించింది. మీకు తెలియదా? లైలా జాకబ్‌ల కథ మీకు తెలిసి ఉండాలే! అని అన్నది. అతడు దీర్ఘముగా ఆలోచించి "మీరు చెబుతుంటే ఈ కథ తెలిసినట్టే ఉన్నది. ఎక్కడో చదివిన జ్ఞాపకము. బహుశా ఈ కథను టాల్‌స్టాయ్ రచించాడేమో" అన్నాడు. ఆమె తాళము చెవి క్రింద పడవేసి షాప్ నుండి బయటకు పరుగెత్తింది. జాకబ్ మెల్లగా తన కుర్చీలో కూర్చొని పుస్తకము చదవటము ప్రారంభించాడు. తను ఎదురు చూస్తున్న ప్రేయసి వచ్చిందని అతనికి తెలియనే లేదు.

మనము దేని గురించి చూస్తామో అది వచ్చినపుడు దానిని పొందుకొనలేకపోతాము. అనేక విషయములు మన దృష్టిని మళ్లిస్తాయి. లేదా తన హృదయములో ఏమున్నాదో దానిని గుర్తించలేకుండా ఉంటాము. యేసుప్రభువును అమితంగా ప్రేమించాలని ఆయననే వెంబడించాలని అనుకుంటాము. కాని లోకాశలు, శరీరాశలు మన దృష్టిని మరలుస్తాయి. లేదా మన కోరికనే మర్చిపోతాము.

విజయనగరం

# సిమ్స్ బాప్టిస్ట్ చర్చ్ వార్షికోత్సవం




విజయనగరం, నవంబర్ 22 : సిమ్స్ ప్లాటినం బాప్టిస్ట్ చర్చ్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు 'సంఘమిత్ర' డా.ఆర్.ఎస్.జాన్ తదితర సంఘ పెద్దలు. కార్యక్రమంలో సంఘాధ్యక్షులు మరియు కాపరియైన రెవ.ఎం.జోసఫ్ ప్రకాశ్ వాక్యమందించారు. సంఘ కోశాధికారి రెవ.ఎం.ఎ.నాయుడు ఏర్పాట్లను ఆద్యంతం పర్యవేక్షించారు. సక్రమంగా జరిగేట్లు చూసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన బాప్టిస్టు సంఘ పెద్దలను సన్మానించారు.

విజయనగరం & బాప్టిస్ట్ పెద్దలచే గజమాలతో రెవ.ఎం.జోసఫ్ ప్రకాశ్‌కు సన్మానం





సంఘ కాపరి రెవ.ఎం.జోసఫ్ ప్రకాశ్‌కు సంఘపెద్దల సన్మానం, సావనీర్ విడుదల



వార్షికోత్సవ కేక్‌ను కట్ చేస్తున్న సంఘ పెద్దలు

## వార్షికోత్సవ చిత్రమాళిక!



ఓట్ ఆఫ్ థ్యాంక్స్ చెబుతున్న సంఘ సెక్రటరీ డా.ఆర్.ఎస్.జాన్

సంఘ కార్యక్రమాన్ని తిలకిస్తున్న సంఘకాపరి రెవ.ఎం.జోసఫ్ ప్రకాశ్ మరియు సంఘస్తులు






వార్షికోత్సవ వేడుకల్లో బుర్రకథ కార్యక్రమం



**నా చిన్నప్పుడు ఇద్దరు లేక ముగ్గురు పిల్లలు చాలన్నది ఎక్కువగా వినేవారం, సినిమాల్లోనూ, వీధుల్లోనూ దాని తాలూక ప్రకటనలు చూసేవారం. ఇప్పుడేమో సేవకులకు ఇద్దరు లేక ముగ్గురు పెళ్లాలని వింటున్నాం. ఇది కడు ధౌర్భాగ్యమంటున్నారు దేవుని వాక్యాన్ని తమ జీవనంలో చూపేవారు - బ్రదర్ వై.కనకరాజు, హోలీ బైబ్లిసిస్ట్.**

# ఎయిర్‌పోర్ట్ బాప్టిస్ట్ చర్చ్ వార్షికోత్సవ చితత్రమాళిక!




కేక్ కటింగ్ సందర్భాన సెక్రటరీ రెవ.ఎంపి.సాలోమోన్ రాజుకు కేక్ తినిపిస్తున్న ట్రెజరర్ సిహెచ్.ఆనందరావు



ప్రసంగానికి విచ్చేసిన డా.గాబ్రియేల్ సాలోమోన్, సంఘకాపరి రెవ.డా.బి.సామ్యూల్, ప్రెసిడెంట్ జి.హెరాల్డ్ విలియమ్స్, సెక్రటరీ రెవ.ఎం.పి.సాలోమోన్ రాజు మరియు ముఖ్య అతిథిగా విచ్చేసిన జీసస్ హీల్స్ మినిస్ట్రీస్ (విశాఖ) వ్యవస్థాపకులు డా.లూక్



విశాఖపట్నం

బిషప్ ఎం.మోహనరావు తండ్రి..

# మామిడి పైడయ్య జ్ఞాపకార్థ కూటమి



పాల్గొన్న అందరికి కృతజ్ఞతలు చెబుతున్న బిషప్ ఎం.మోహనరావు

నవంబర్ 20, తగరపువలస, విశాఖ : బిషప్ ఎం.మోహనరావు విశాఖ నుంచి విశ్వవ్యాప్తంగా సేవలందిస్తున్న సంగతి విశాఖలో అనేకులకు తెలిసిందే. గతేడాది వారి తండ్రి మామిడి పైడయ్య మరణించారు. నేడు తొలి జ్ఞాపకార్థ కూటమిని జరిపారు.. పాస్టర్లెందరో పాల్గొన్నారు. బిషప్ ఎం.ఎ.పాల్ (విశాఖ) వాక్యమందించాల్సి ఉండగా అనివార్య కారణములవల్ల ఆయన అందించలేకపోయారు. అందువల్ల రెవ.డా.పి.యేసుపాదం (విశాఖ) వాక్యమందించారు. అధ్యక్షునిగా బిషప్ ఎస్.రాజుబాబు(విశాఖ) ఆద్యంతం ఓ క్రమంలో నడిపారు. పాల్గొన్నవారందరూ మామిడి పైడయ్యతో తమకున్న స్మృతులను పంచుకున్నారు. పాల్గొన్నవారిలో రెవ.డా.విల్సన్ బాబు, రెవ.డా.డేవిడ్ కిరణ్ కుమార్ (అడ్డురోడ్డు), రెవ.డా.జాన్ సమర్పణ రాజు, రెవ.జార్జిబాబు, స్థానిక పెంతెకోస్తు పాస్టర్, రెవ.శామ్సన్ తదితరులెందరో ఉన్నారు. అనంతరం వచ్చిన వారందరికీ భోజన ఏర్పాట్లు చేసారు బిషప్ ఎం.మోహనరావు.



డా.పి.యేసుపాదం, రెవ.విల్సన్ బాబు, రెవ.డా.డేవిడ్ కిరణ్ కుమార్







Printed ,Published , Edited and Owned by Y.Kanaka Raju, 13 - 237, Ambedkar Nagar, Old Police Station Center, Nr.TIC Point, Arilova, Visakhapatnam - 530 040, Andhra Pradesh State, INDIA. Ph : 9346960601,9866113513. E-mail: y_kanakaraju1@yahoo.co.in., Printed at JC Printers, Ambedkar Nagar, Arilova, Visakhapatnam - 40.